

పెళ్లికి వెళ్లి వచ్చే లోపు ఇంట్లో చోరీ

గద్వాల క్రైం, మే 31 : పెళ్లికి వెళ్లిన వారు తిరిగొచ్చే సరికి ఇంట్లో చోరీ జరిగింది. ఈ సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని హైమత్‌నగర్‌లో గురువారం రాత్రి జరిగింది. పట్టణ రెండవ ఎస్‌ఐ రాము తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హైమత్‌నగర్‌లో నివాసం ఉంటున్న జునేత్ గురువారం రాత్రి తన కుటుంబంతో పట్టణంలోని ప్యారడైజ్ ఫంక్షన్ హాలులో జరిగిన పెళ్లికి వెళ్లారు. వివాహం అనంతరం శుక్రవారం తెల్లవారుజామున మూడింటికి ఇంటికి చేరుకున్నారు. అప్పటికే తలుపు తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లో ఉన్న 92 వేల రూపాయలు, 20 తులాల వెండి చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

- రేపు ఉమ్మడి పాలమూరు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కౌంటింగ్
- రెండు పార్టీలే పోటీలో ఉండటంతో ఫలితం త్వరగానే వెలువడే అవకాశం
- 1,439 ఓట్లకు గాను 1,437 ఓట్ల పోలింగ్..
- ఓటు వేయని ఇద్దరు సభ్యులు
- విజయంపై ఎవరికి వారే ధీమా..
- 300 ఓట్ల మెజారిటీ వస్తుందని ఆశలు

ఉత్కంఠ



బ్యాలెట్ బాక్సులను భద్రపరిచిన మహబూబ్‌నగర్ బాలుర జూనియర్ కళాశాల



మన్నె జీవన్‌రెడ్డి (కాంగ్రెస్ అభ్యర్థి)



నవీన్ కుమార్‌రెడ్డి (బీఆర్‌ఎస్ అభ్యర్థి)

మహబూబ్‌నగర్, మే 31 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): హోరాహోరీగా సాగిన ఉమ్మడి పాలమూరు స్థానిక సంస్థల ఉప ఎన్నికలో విజయం ఎవరిని వరిస్తుందనే విషయంలో ఉత్కంఠ నెలకొంది. కౌటింగ్ ఆదివారం జరుగనుండగా.. ఎవరికి వారే గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తూ.. 300 ఓట్ల మెజారిటీ వస్తుందని అంటున్నారు. మార్చి 28వ తేదీన పోలింగ్ నిర్వహించగా.. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ఏప్రిల్ 2వ తేదీన కౌంటింగ్ జరగాల్సి ఉంది. ఈ కోడ్ అమల్లో ఉండగానే పార్లమెంట్ ఎన్నికల కోడ్ రావడంతో ఈ గెలుపు ప్రభావం లోక్‌సభ ఎన్నికలపై పడకూడదని కేంద్ర ఎన్నికల సంఘం ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్‌ను రెండు నెలలకు వాయిదా వేసింది. దాంతో ఫలితాలు వస్తాయని ఆశించిన అభ్యర్థులకు, పార్టీలకు నిరీక్షణ తప్ప లేదు. ఎట్టకేలకు తదుపరి షెడ్యూల్ ప్రకారం ఆదివారం ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పోలింగ్ ముగిసిన వెంటనే అన్ని కేంద్రాల నుంచి బ్యాలెట్ బాక్సులను మహబూబ్‌నగర్ జూనియర్ కళాశాలలో భద్రపరిచారు. తక్కువ ఓట్లు కావడంతో తొందరగానే ఫలితాలు వెలువడే అవకాశం ఉంది. అభ్యర్థులు కూడా తక్కువగానే ఉండటంతో మొదటి ప్రాధన్య ఓట్లతోనే విజయం వరించనుంది. పది కేంద్రాల్లో పోలింగ్ జరగ్గా.. కౌంటింగ్ కోసం ఐదు టేబుళ్లను ఏర్పాటు చేయనున్నారు. మొదట చెల్లిన ఓట్లు, చెల్లని ఓట్లను లెక్కించి.. ఆ తర్వాత అభ్యర్థుల వారీగా మొదటి ప్రాధాన్య ఓట్లను లెక్కిస్తారు. ఈ లెక్కింపు తర్వాత చెల్లిన ఓట్లు, చెల్లని ఓట్లను నిర్ధారించుకుని.. గెలుపునకు కావాల్సిన ఓట్లను నిర్ధారిస్తారు. ఆ సంఖ్య మేరకు మొదటి ప్రాధాన్య ఓట్లలో ఎవరికీ మెజారిటీ రాకపోతే.. ఎలిమినేషన్ ప్రక్రియ చేపట్టి, రెండో ప్రాధాన్య ఓట్లను లెక్కిస్తారు. ఏ అభ్యర్థికీ కోటా మేరకు ఓట్లు రాకపోతే.. చివరికి మిగిలిన అభ్యర్థి గెలుపొందినట్లు ప్రకటిస్తారు. అయితే అభ్యర్థులు తక్కువగా ఉండటం, పోటీ కూడా రెండు పార్టీల మధ్యనే నెలకొనడంతో మొదటి ప్రాధాన్యత ఓట్ల తర్వాత విజేతను ప్రకటించే అవకాశం ఉంది.

హోరాహోరీగా సాగిన పోరు..

బీఆర్‌ఎస్ నుంచి స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఉన్న కశిరెడ్డి నారాయణరెడ్డి.. కల్వకుర్తి నియోజకవర్గం నుంచి గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసి గెలిచారు. దాంతో ఆయన తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడంతో ఇక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంతో ఇటు కాంగ్రెస్, అటు స్థానిక సంస్థల్లో బలంగా ఉన్న బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులను బరిలో నిలిపింది. బీజేపీ ఈ ఎన్నికకు దూరంగా ఉంది. షెడ్యూల్ వచ్చిన వెంటనే అభ్యర్థులు ఖరారు కాగా.. కాంగ్రెస్ తరఫున మన్నె జీవన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ తరఫున నవీన్‌కుమార్‌రెడ్డి బరిలో నిలిచారు. వెంటనే రెండు పార్టీలు క్యాంపు రాజకీయాలు ప్రారంభించింది. కాంగ్రెస్ అసెంబ్లీ విజయం జోష్‌తో.. స్థానిక సంస్థల్లో ఉన్న బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులను ఇబ్బడిముబ్బడిగా చేర్చుకుని తన బలం పెంచుకుంది. బీఆర్‌ఎస్ కూడా ప్రజా ప్రతినిధులను క్యాంపులకు తీసుకెళ్లి.. ఓట్లు పోకుండా జాగ్రత్త పడింది. కాంగ్రెస్ గెలుపును సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని.. ఆపరేషన్ ఆకర్ష్‌కు తెర లేపారు. మహబూబ్‌నగర్‌లో సభను కూడా నిర్వహించారు. బీఆర్‌ఎస్ గెలుపు కోసం.. మాజీ మంత్రి, ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఏకంగా గోవాలో ఏర్పాటు చేసిన క్యాంపునకు వెళ్లారు. అలాగే ఓట్ల కొనుగోళ్లకు కూడా వెనుకాడలేదని సమాచారం. క్రాస్ ఓటింగ్ జరుగకుండా ఇరు పార్టీలు జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ.. భారీగా క్రాస్ ఓటింగ్ జరిగినట్లు అంచనాలు ఉన్నాయి. క్రాస్ ఓటింగ్ జరిగితే కాంగ్రెస్ అభ్యర్థి గెలుపొందనుండగా, అలా కాకుండా.. బీఆర్‌ఎస్ ఓట్లు ఆ పార్టీ అభ్యర్థికే పడితే గులాబీ పార్టీనే విజయం వరించనుంది. సెంటిమెంట్, డబ్బుల పంపకం ఈ క్రాస్ ఓటింగ్‌పై ఏ మేర ప్రభావం చూపిందనేది ఎన్నికల ఫలితాలతో తేలనుంది.

1,437 ఓట్ల పోలింగ్..

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో 1,439 మందికి ఓటు హక్కు సదుపాయం కల్పించగా, 1,437 ఓట్లు పోల్ అయ్యాయి. నారాయణపేట జిల్లా మంతన్‌గోడ్ ఎంపీటీసీ సభ్యురాలు సుమిత్ర, నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం గుడ్లనర్వ ఎంపీటీసీ సభ్యురాలు శారదమ్మ ఓటు వేయలేదు. 99.86 శాతం పోలింగ్ నమోదైంది. గోవా, హైదరాబాద్, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లలో క్యాంపుల్లో ఉన్నవారు నేరుగా పోలింగ్ కేంద్రాలకు వచ్చి, ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే ఎక్స్ అఫిషియో ఓట్లు కూడా మొత్తం పోలయ్యాయి. కొడంగల్‌లో రేవంత్‌రెడ్డి, ఆయా నియోజకవర్గాల్లో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఓటు వేశారు. అత్యధికంగా పోలింగ్ జరగడంతో ఎవరి అంచనాలు వారు వేసుకుంటున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి.. బీఆర్‌ఎస్ పాలనలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు చాలా ఇబ్బందులు పడ్డారని, మర్యాద దక్క లేదని, పదవి ఉన్నా పనిలేక, నిధులు లేక, బిల్లులు రాక కష్టనష్టాలు పడ్డారని అంటున్నారు. 300 ఓట్ల మెజారిటీతో గెలిచి.. సీఎం రేవంత్‌రెడ్డికి బహుమతిగా ఇస్తామని చెబుతున్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డి.. తమ పార్టీ స్థానిక సంస్థల్లో బలంగా ఉండటం ద్వారా పార్టీ కేడర్ అంతా ఏకతాటిపైకి వచ్చి పని చేసిందని, క్రాస్ ఓటింగ్ బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌కు కాకుండా కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌కు జరిగిందని అంటున్నారు. కాంగ్రెస్ ప్రలోభాలకు గురిచేసినా 300 ఓట్ల మెజారిటీ తామే గెలవబోతున్నామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఇరు పార్టీల నాయకులకు ఈ గెలుపు ఉత్కంఠగా మారిందని చెప్పొచ్చు.

పవర్‌ఫుల్ డిమాండ్



మహబూబ్‌నగర్‌లోని విద్యుత్ భవన్

- రికార్డు స్థాయిలో విద్యుత్ వినియోగం
- యాసంగిలో సాగు తగ్గినా.. తగ్గని కరెంట్ వాడకం
- అధిక ఎండలు, ఉక్కపోతే కారణం

పాలమూరు, మే 31: ఎండలు మండుతున్నాయి. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడటంతో వాతావరణంలో మార్పులు వచ్చి, వర్షాలు పడతాయనుకుంటే కనీసం సాయంత్రం వేళ గాలులు కూడా వీయడం లేదు. దాంతో సాయంత్రం ఏడు గంటలైనా ఉక్కపోత, వేడి తగ్గడం లేదు. ఈ నేపథ్యంలో పగలు, రాత్రి కూలర్లు, ఏసీలు ఆన్ చేసే ఉంచుతున్నారు. అందుకే ఈ యాసంగి సీజన్‌లో వరి సాగు విస్తీర్ణం 36 వేల ఎకరాలు తగ్గినా విద్యుత్ వాడకం మాత్రం తగ్గడం లేదు.



మహబూబ్‌నగర్‌లోని 132/11కేవీ సబ్‌స్టేషన్

ఇదే మొదటి సారి

మహబూబ్‌నగర్ జిల్లాలో ఈ వేసవిలో విద్యుత్ వినియోగం అన్యూహ్యంగా పెరిగింది. తొలిసారి రికార్డు స్థాయిలో గరిష్ఠ డిమాండ్ నెలకొంది. యాసంగి పంటలు పూర్తయిన నేపథ్యంలో విద్యుత్ వినియోగం తగ్గాల్సి ఉండగా పెరగడం గమనార్హం. పరిశ్రమలు, ఇళ్లలో విద్యుత్ వాడకం పెరగడంతో ఈ నెల 29న 4.87 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం కాగా, 26వ తేదీన 4.95 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను వినియోగించారు. జిల్లాలో ఇంతటి వినియోగం నమోదవటం ఇదే మొదటి సారి. ఈ ఏడాది జనవరిలో 31 రోజులకు 197.2 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం కాగా.. ఫిబ్రవరిలో 29 రోజులకే 197.28 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం అయ్యింది. అదనపు భారాన్ని దృష్టిలో ఉంచుకొని ఎప్పటికప్పుడు విద్యుత్ పరికరాలు, ట్రాన్స్‌ఫార్మర్ల స్థాయిలను పెంచేందుకు సిద్ధంగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

సాగు తగ్గినా..

మహబూబ్‌నగర్ జిల్లాలో 2022-23 యాసంగిలో 1,46,906 ఎకరాల్లో వరి వేయగా, 2023-24 యాసంగిలో 1,09,000 ఎకరాల్లో సాగు చేశారు. వరి సాగు గతేడాది కంటే 36 వేల ఎకరాలు తగ్గగా.. వ్యవసాయానికి విద్యుత్ వాడకం తగ్గింది. వ్యవసాయానికి విద్యుత్ వాడకం తగ్గితే.. మొత్తంగా విద్యుత్ వాడకం కూడా అదే స్థాయిలో తగ్గాల్సి ఉంది. కానీ తగ్గకపోవడంపై విద్యుత్ అధికారులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. వేసవి నేపథ్యంలో ఏసీలు, ఫ్యాన్‌లు, ఇతర అవసరాలకు విద్యుత్ వినియోగం పెరగడంతో తగ్గడం లేదని అంటున్నారు. 2023లో మేలో యాసంగి కోతలు పూర్తయ్యే సరికి 136.83 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం కాగా.. ఈ ఏడాది 36 వేల ఎకరాలు పంటల సాగు తగ్గినా మే 25వ తేదీ నాటికే 135.73 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరిగిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

ఏసీలు, కూలర్ల వాడకం పెరిగింది



వాతావరణంలో మార్పు వచ్చింది. సాయంత్రం ఏడు గంటలైనా వేడి, ఉక్కపోత తగ్గడం లేదు. అందుకే ఫ్యాన్లు, ఏసీలు, కూలర్లు రోజంతా వాడుతున్నారు. మరోవైపు కొత్త ఏసీలు, కూలర్లు పెరిగాయి. అందుకే విద్యుత్ వినియోగం పెరిగింది. అయినా డిమాండ్‌కు సరిపోయినంత విద్యుత్‌ను సరఫరా చేస్తున్నాం. ఎక్కడా కోతలు విధించడం లేదు. నిర్వహణ పనులు, మరమ్మతుల కోసమే ముందస్తు సమాచారంతో కొంత సమయం విద్యుత్ సరఫరా ఆపి, అనంతరం సరఫరా చేస్తున్నాం.

- పి.వెంకట రమేష్, ఎస్ఈ

ఎండ ప్రచండం

- నవాబ్‌పేటలో 42.9 డిగ్రీలు



అచ్చంపేటలో ఎండకు గొడుగులు ఏర్పాటు చేసుకొని నిమ్మకాయలు అమ్ముతున్న మహిళలు

మహబూబ్‌నగర్/వనపర్తి అర్బన్/గద్వాల/నాగర్‌కర్నూల్ టౌన్/నారాయణపేట మే 31 : ఎండలు దంచికొడుతున్నాయి.. ఉక్కపోత, ఉబ్బరానికి తోడు వడగాలులు కూడా వీస్తున్నాయి... దీంతో రోహిణి కార్తె అర్ధభాగం పూర్తయ్యేసరికి ఎండలు మండుతున్నాయి. మరో వారం రోజుల పాటు ఈ కార్తె ఉండనుంది. రోహిణి ఎండలు అత్యధికంగా ఉంటాయి..ఈ ఏడాది వర్షాల కారణంగా మొదటి అర్ధభాగం ఎలాగోలా గడిచిపోగా మిగతా అర్ధ భాగం భానుడి సెగనుంచి తప్పించుకోవడం కష్టమౌతోంది. ఈనెల 8న మృగశిర కార్తె ప్రారంభం అవుతుంది. ఈ కార్తె నుంచే ఎండలు తగ్గుముఖం పడతాయి. అప్పటివరకు నైరుతి రుతుపవనాలు కూడా వచ్చే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ చెబుతుండటంతో వారంరోజుల పాటు ఎండలను భరించక తప్పదని స్పష్టమవుతోంది.

- మహబూబ్‌నగర్ జిల్లాలోని నవాబ్‌పేటలో 42.9 డిగ్రీలు నమోదుకాగా, సీసీకుంటలో 42.8, కోయిలకొండలో 42.3, బాలానగర్, కౌకుంట్ల, మహబూబ్‌నగర్ రూరల్‌లో 41.8, మహబూబ్‌నగర్, దేవరకద్రలో 41.7 డిగ్రీలు నమోదుకాగా, జడ్చర్లలో 40.7 డిగ్రీలు నమోదైంది.
- నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలంలో 42.4 డిగ్రీలు నమోదు కాగా, వంగూరులో 42.1, కల్వకుర్తిలో 41.3, కొల్లాపూర్‌లో 40.9, కోడేరులో 40.8, నాగర్‌కర్నూల్‌లో 40.7, చారకొండలో 40.5, ఉప్పునుంతలలో 40.0, అచ్చంపేటలో 39.4, పదరలో 39.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.
- వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలంలో 41.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. చిన్నంబావి 40.5, శ్రీరంగాపూర్ 40.1, ఘణపూర్, గోపాల్‌పేట, వీపనగండ్ల 40.0, పెబ్బేరు, వనపర్తి, కొత్తకోట, అమరచింత, పెద్దమందడి, మదనాపూర్ 39.9, ఆత్మకూరు 39.7, రేవల్లి 39.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.
- జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లిలో 41.3, అలంపూర్‌లో 41, ఇటిక్యాలలో 40.4, ధరూర్‌లో 40.2 డిగ్రీలు నమోదైంది. కేటీదొడ్డి, అయిజ లలో 40, రాజోలిలో 39.9, మానవపాడులో 39.8, ఉండవెల్లిలో 39.7, మల్దకల్‌లో 39.7, గద్వాలలో 39.5, గట్టులో 39.1 డిగ్రీలు నమోదైంది.
- నారాయణపేట జిల్లా మక్తల్‌లో 39 డిగ్రీలు, కోస్గి, నర్వ లలో 38 డిగ్రీలు నమోదైంది.

మహిళా సంఘాలకు ఉపాధి



మహిళా సంఘాల సభ్యులు కుట్టిన దుస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ (ఫైల్)

- స్కూల్ డ్రెస్‌ల తయారీని వారికి అప్పజెప్పిన ప్రభుత్వం
- ఆర్థికంగా చేయూతను అందించేందుకే..
- జోగుళాంబ గద్వాల జిల్లాలో 52 కేంద్రాల్లో 725 మందికి పని
- 53,896 మంది విద్యార్థులకు తయారవుతున్న దుస్తులు
- జతకు రూ.50 కూలీ గిట్టుబాటు కాదంటున్న మహిళలు

గద్వాల మే 31: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా అందజేసే స్కూల్ డ్రెస్‌ల కుట్టుతో మహిళా సంఘాలకు ఉపాధి లభిస్తోంది. జోగుళాంబ గద్వాల జిల్లాలో పాఠశాలలు తెరిచేలోపు విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేయాలని విద్యాశాఖ అధికారులు కృతనిశ్చయంతో ఉన్నారు. అయితే ఈసారి వస్త్రాల కుట్టు బాధ్యతను ఏజెన్సీలకు కాకుండా మహిళా సంఘాలకు అప్పజెప్పారు. సంఘాలను బలోపేతం చేసేందుకు స్త్రీ నిధి, బ్యాంకు లింకేజీ రుణాలను పావలాకే వడ్డీకి ఇవ్వడంతో పాటు ఇతర ఆర్థిక వెసులుబాటు కల్పించాలని ఈ నిర్ణయం తీసుకుంది. జిల్లాలో 52 కేంద్రాల్లో దాదాపు 725 మంది మహిళలు దుస్తులు కుడుతున్నారు. ఒకేసారి అంతమంది వస్త్రాలను కుడుతుండటంతో వస్త్రాలు చకచకా సిద్ధం అవుతున్నాయి. ఇప్పటికే దాదాపు 42 శాతం వస్త్రాలను కుట్టినట్లు డీఆర్‌డీవో నర్సింగ్‌రావు తెలిపారు.

తరగతుల వారీగా..



అనంతపురం కుట్టు మిషన్ కేంద్రంలో వస్త్రాలను కుడుతున్న మహిళలు

విద్యార్థులకు రెండు జతల దుస్తులు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పాఠశాలలు ప్రారంభం కాగానే ఒక జత ఇవ్వాలని ఆదేశించింది. జిల్లాలో ఒకటో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు 52,125 మంది విద్యార్థులు ఉండగా, తొమ్మిదో తరగతి నుంచి పదో తరగతి వరకు 9,764 మంది విద్యార్థులు ఉన్నారు. వారిలో 10వ తరగతి విద్యార్థులు బయటకు వెళ్లిపోనుండటంతో 53,896 మంది విద్యార్థులు ఉండనున్నారు. అందులో బాలికలు 27,823 మంది ఉండగా, బాలురు 26,073 మంది ఉన్నారు. ఒకటో తరగతి నుంచి మూడో తరగతి వరకు బాలికలకు బాడీ ఫ్రాక్‌లు, నాల్గు, ఐదు తరగతి బాలికలకు స్కర్ట్స్, ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు బాలికలకు పంజాబీ డ్రెస్‌లు, బాలురకు అంగీలు, ప్యాంట్లు, నిక్కర్లు కుట్టాలి.

రూ.50కి కుట్టేదెలా?

మహిళా సంఘాలను బలోపేతం చేయడానికి విద్యార్థుల దస్తుల కుట్టు పని వారికి అప్పగించడం బాగానే ఉన్నా.. కుట్టు కూలీ జతకు రూ.50 ఇవ్వడంపై మహిళలు పెదవి విరుస్తున్నారు. ఒకరోజు కూలీకి పోతే రూ.350 నుంచి రూ.500ల వరకు ఇస్తుండగా.. తాము రోజంతా దుస్తులు కుట్టినా రూ.400 కూడా పడటం లేదని అంటున్నారు. ప్రైవేటు స్కూల్స్ విద్యార్థుల ఒక జత దుస్తులు కుడితే రూ.200 నుంచి రూ.300 వరకు ఇస్తున్నారని చెబుతున్నారు. ప్రభుత్వం మార్కెట్ ప్రకారం కాకపోయినా.. జతకు కనీసం రూ.100 అయినా ఇవ్వాలని కోరుతున్నారు.

మహిళా సంఘాలకు ఇవ్వడం సంతోషం



ప్రభుత్వం విద్యార్థుల దుస్తుల కుట్టు కూలీ పని మహిళా సంఘాలకు ఇవ్వడం చాలా సంతోషం. ఏజెన్సీల కంటే మేము బాగా కుట్టి, నిరూపించుకుంటాం. దీనిని విజయవంతం చేస్తే ప్రభుత్వం ఇతర రంగాల పనులను కూడా మహిళా సంఘాలకు ఇచ్చే అవకాశం ఉంది. దీని వలన మాకు ఆర్థిక చేయూత లభిస్తుంది.

- ఉసేనమ్మ, అనంతపురం

కుట్టు కూలీ ధర గిట్టుబాటు కాదు



ప్రభుత్వం చెప్పిన ధరకే మేము దుస్తులను కుడుతున్నాం. జతకు రూ.50 ఇస్తామని ప్రభుత్వం చెప్పింది. అయితే ప్రస్తుతం మార్కెట్‌లో అన్ని రేట్లు పెరిగిపోయాయి. దానికి అనుగుణంగా కుట్టు కూలీ కూడా కొంత పెంచితే.. చేసిన కష్టానికి ఫలితం ఉటుంది. విద్యార్థులు అందంగా కనిపించేలా మా పనితనం ఉంటుంది.

- షబనాబేగం, అనంతపురం

పశువుల కొవ్వు నుంచి నూనె తయారీ

- పోలీసులకు ఫిర్యాదు చేసిన స్థానికులు
- నూనె తయారీ సామగ్రి స్వాధీనం





నూనె తయారు చేస్తున్నది ఈ షెడ్డులోనే.. ; నూనె తరలించేందుకు వాడుతున్న డబ్బాలు

అయిజ, మే 31 : జోగుళాంబ గద్వాల జిల్లా, అయిజ పట్టణంలో గుట్టు చప్పుడుగా పశువుల కొవ్వుతో నూనె తయారు చేసి విక్రయిస్తున్నారు. పట్టణంలోని ఒక కాలనీలో ప్రతీ ఆదివారం 10 నుంచి 12 పశువులను కోసి మాంసం విక్రయిస్తున్నారు. మిగిలిన కొవ్వుతో నూనె తయారు చేస్తున్నారు. ఆ నూనెను డబ్బాలలో నింపి స్థానికంగా హోటళ్లకు విక్రయిస్తున్నారు. అలాగే నాగల్‌దిన్నె వంతెన మీదుగా ఎమ్మిగనూర్, ఆదోని, కర్ణాటక రాయిచూర్ ప్రాంతాలకు తరలించి అమ్ముతున్నారు. కొవ్వును కరిగించే సమయంలో దుర్వాసన వస్తుండటంతో శుక్రవారం స్థానికులు తయారీదారులతో వాగ్వాదానికి దిగారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకొని నూనె తయారు చేసే సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది.


చెంచు గిరిజన కుటుంబాలకు శాశ్వత ఉపాధి

- రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్



అధికారులతో మాట్లాడుతున్న శరత్

మన్ననూర్, మే31: నల్లమల ప్రాంతంలోని నూరు చెంచు గిరిజన కుటుంబాలకు శాశ్వతంగా ఉపాధి కల్పించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్ తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామంలో ఆయన శుక్రవారం పర్యటించారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మన్ననూరులో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై కలెక్టర్ ఉదయ్ కుమార్‌తో కలిసి సమీక్ష చేశారు. శిథిలావస్థకు చేరుకొని నిరుపయోగంగా ఉన్న చెంచులక్ష్మి మ్యూజియం పరిసరాలను పరిశీలించారు. విశాలమైన ప్రదేశంలో ఉన్న మ్యూజియాన్ని ఎందుకు నిర్లక్ష్యం చేశారని అధికారులను ప్రశ్నించారు. మరమ్మతులకు అయ్యే ఖర్చుపై నివేదికను పంపాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో రోహిత్ గోపిడిని ఆదేశించారు. మ్యూజియం పరిధిలో మన్ననూరు నుంచి శ్రీశైలం ప్రాజెక్టు వరకు ఎక్కడ స్థలం ఉన్నా సేకరించాలని, ఆ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించి నిరుద్యోగ చెంచు యువతీ యువకులకు ఉపాధి అవకాశాలను కల్పించాలన్నారు. వ్యాపారాలు చేసుకునేందుకు ఆసక్తి కలిగిన వారికి రుణాలను మంజూరు చేస్తామన్నారు. అనంతరం చెంచు మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శానిటరీ న్యాప్‌కిన్‌ల తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. యంత్రాలు సరిగ్గా పని చేయడం లేదని చెంచు మహిళలు తెలిపారు. భద్రాచలం ఐటీడీఏలో న్యాప్‌కిన్ కేంద్రం చక్కగా నడుస్తోందని, అదే ప్రమాణాలతో కూడిన యంత్రాలను ఇక్కడ బిగిస్తామని కార్యదర్శి చెప్పారు. జీసీసీకి నిర్వహణ బాధ్యతలు అప్పగించి, చెంచు మహిళలకు స్వయం ఉపాధి కల్పిస్తామని తెలిపారు. అనంతరం మన్ననూరులోని ఆర్యసమాజ్ భవన స్థలాన్ని పరిశీలించారు. ఆ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం మన్ననూరు ఐటీడీఏ కార్యాలయంలో అధికారులు, చెంచు గిరిజన నాయకులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, పదేళ్లుగా ఉన్న అధికారి బదిలీ చేయాలని సంఘాల నాయకులు విన్నవించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం దృష్టికి తీసుకెళ్లి అభివృద్ధి కోసం నిధుల కేటాయింపునకు చేస్తామని తెలిపారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలు, చెంచు గురుకులాల్లో 11 శుద్ధజల కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో డీటీడీవో కమలాకర్‌రెడ్డి, జీసీసీ మేనేజర్ సంతోష్ పాల్గొన్నారు.



లారీని ఢీకొన్న డీసీఎం
క్లీనరు మృతి

కొత్తకోట, మే 31 : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన పాలెం గ్రామ శివారులోని జాతీయ రహదారిపై గురువారం అర్ధరాత్రి చోటుచుసుకున్నది. ఎస్‌ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కర్నూల్ నుంచి హైదారాబాద్ వైపు వెళ్తున్న లారీని వనపర్తి జిల్లా కొత్తకోట మండలం పాలెం శివారులో డీసీఎం వెనక నుంచి ఢీకొంది. డీసీఎంలోని క్లీనరు సూర్య (21) అక్కడికక్కడే మృతి చెందాడు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై మంజునాథ్‌రెడ్డి తెలిపారు. మృతుడు వెంకన్నగూడ ఫరూక్‌నగర్ మండల రంగారెడ్డి జిల్లాకు చెందినట్లు గుర్తించామని ఆయన తెలిపారు.

తండాల్లో ఎక్సైజ్ అధికారుల దాడులు

- 37 లీటర్ల నాటుసారా, 427 కిలోల నల్లబెల్లం స్వాధీనం

- ఏడుగురి అరెస్టు

పాన్‌గల్, మే 31: మండలంలోని తెల్లరాళ్లపల్లి తండా, శాఖాపూర్ తండాలలో శుక్రవారం ఉదయం వనపర్తి, కొత్తకోట ఎక్సైజ్ సీఐలు వెంకటేరెడ్డి, కరుణ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ బాలకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. తండాల్లోని పలువురి ఇళ్లలో లభించిన బెల్ల పానకం ధ్వంసం చేసి పారబోశారు. అనంతరం 37 లీటర్ల నాటుసార, 427 కిలోల నల్లబెల్లం స్వాధీనం చేసుకుని తెల్లరాళ్లపల్లి తండాకు చెందిన కేతావత్ కైక, మూడావత్ లక్ష్మి, హన్మి, ఇస్లావత్ బాబీ, బొజ్జమ్మ, శాఖాపూర్ తండాకు చెందిన నేనావత్ శంకర్, నేనావత్ లాలులను అరెస్టు చేసినట్లు సీఐ వెంకటేరెడ్డి తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐలు విశ్వనాథం, సంధ్యరాణి, కృష్ణకాంత్, సృజనకుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాల్లో చోరీలు

అయిజ, మే 31 : జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలంలోని తూముకుంట ఊరి బయట ఉన్న చెన్నకేశవస్వామి ఆలయంలో శుక్రవారం మధ్యాహ్నం చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయం తాళాలు పగలగొట్టి లోనికి ప్రవేశించారు. హుండీని ధ్వంసం చేసి, అందులోని నగదు, కానుకలను ఎత్తుకెళ్లారు. గర్భగుడిలోని విగ్రహం వెనుక ధూప, దీప నైవేద్యం కోసం ఉంచిన నగదు, కానుకలను తీసుకెళ్ళారు. సాయంత్రం ఐదు గంటల సమయంలో ఆలయానికి వెళ్ళిన గ్రామస్థులు తాళాలు పగలగొట్టి ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ విజయభాస్కర్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఆలయంలోని హుండీని మూడేళ్లుగా లెక్కబెట్టలేదని గ్రామస్థులు తెలిపారు. పట్టణంలోని దుర్గానగర్ వీధిలోని వరాంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. ఆలయం తలుపులు పగలగొట్టి విగ్రహంపై ఉన్న వెండి కవచాన్ని ఎత్తుకెళ్ళారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ సంఘటన స్థలాన్ని చేరుకొని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్‌తో విచారణ నిర్వహించారు.


చోరీకి గురైన అయిజ దుర్గానగర్ వీధిలోని వరాంజనేయస్వామి వెండి కవచం (ఫైల్)

వివాహిత అదృశ్యం
- కేసు నమోదు

అమ్రాబాద్, మే 31: వివాహిత మహిళ అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేసిన సంఘటన చోటుకేసుకుంది. అమ్రాబాద్ ఎస్‌ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం... నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం రంగాపురం గ్రామానికి చెందిన పాపిశెట్టి స్వాతి (24) అనే వివాహిత మహిళ తన తల్లి, మేనత్తతో కలిసి అమ్రాబాద్ మండల పరిధిలోని మన్ననూర్ ఆర్డిటీ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు కోసం వచ్చి శుక్రవారం ఉదయం అదృశ్యమైంది. దీంతో ఆమె భర్త శ్రీను అమ్రాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. హైదరాబాద్ కాటేదాన్కు చెందిన స్వాతితో గత ఏడు సంవత్సరాల క్రితం శ్రీనుకు వివాహం జరిగిందని వీరికి ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారని అయన తెలిపారు. ఇటీవల కాలంలో స్వాతి ఆన్‌లైన్ గేమింగ్‌తో నష్ట పోయిందని, గత వారం రోజుల క్రితం కూడా అచ్చంపేట పట్టణంలో ఆమె ఈ విధంగానే తప్పించుకోవడానికి ప్రయత్నం చేస్తే నచ్చజెప్పి ఇంటికి తీసుకువచ్చినట్లు భర్త శ్రీను ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడని ఎస్‌ఐ వెల్లడించారు.

మిత్రుడి కుటుంబానికి చేయూత

గండీడ్, మే 31 : మండల పరిధిలోని లింగాయిపల్లి గ్రామంలో తేనెటీగల దాడిలో మృతిచెందిన జీడీ వెంకట్రాములు కుటుంబ సభ్యులకు పలువురు ఆర్థిక సాయం అందించారు. వెంకట్రాములుకు ఇటీవల పెద్ద తేనెటీగలు కరవగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందగా శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. 2000-2001లో పదవ తరగతి చదువుకున్న మిత్రులు కొందరు బాధిత కుటుంబ సభ్యులకు రూ.10వేల ఆర్థిక సహాయం అందించి మనోధైర్యం అందించారు. అలాగే గ్రామ ముదిరాజ్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో రూ.7600, మత్స్య సహకార సంఘం తరఫున రూ.2 వేలు, బీజేపీ నాయకుడు, కేఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ శరత్ కుమార్‌రెడ్డి రూ. ఐదువేలు ఇలా పలువురు వెంకట్రాములు కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో మొగులయ్య, వెంకటయ్య, నర్సయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్ రెడ్డి, మల్కయ్య, బాలరాజు గౌడ్, ఎల్లయ్య, కేశవులు, బాలనర్సింములు పాల్గొన్నారు.


మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందిస్తున్న స్నేహితులు











తెలంగాణ బలి దేవత కాంగ్రెస్సే

- వందలాది మంది అమరులయ్యింది ఆ పార్టీ వల్లే...
- అమరుల స్థూపం ఎవరి వల్ల నిర్మించాల్సి వచ్చింది?
- కాంగ్రెస్ పదేళ్ల తాత్సారం వల్లే కదా బలి దానాలు: కేటీఆర్



హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో వందలాది మంది అమరులయ్యింది ఎవరి వల్ల? అమరుల స్థూపం ఎవరి వల్ల నిర్మించాల్సి వచ్చింది.. గతంలో రేవంత్‌రెడ్డి చెప్పినట్లు తెలంగాణ బిడ్డల్ని చంపిన బలి దేవత ఎవరు...? అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు ప్రశ్నించారు. 'ఎక్స్' వేదికగా కాంగ్రెస్‌ను ఆయన శుక్రవారం విమర్శించారు. 1952లోనే ఉమ్మడి రాష్ట్రం వద్దని, హైదరాబాద్ ప్రత్యేక రాష్ట్రంగానే ఉండాలని పోరాటం చేస్తున్న విద్యార్థులపై సిటీ కాలేజీ వద్ద కాల్పులు జరిపి ఆరుగురిని బలిగొన్నది, 1969-71 తొలిదశ ఉద్యమంలో 370 మంది తెలంగాణ బిడ్డల్ని కాల్చి చంపింది అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కాదా..? అని నిలదీశారు. 1971 పార్లమెంట్ ఎన్నికల్లో 11/14 సీట్లలో తెలంగాణ ప్రజా సమితి పార్టీని గెలిపిస్తే ఆ పార్టీని మాయం చేసింది, దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రజాస్వామికంగా తమ ఆకాంక్షను వ్యక్తం చేస్తే, తెలంగాణను తుంగలో తొక్కింది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. 2004లో మాట ఇచ్చి, పదేళ్ల తాత్సారం చేసి వందలాది మంది తెలంగాణ బిడ్డలు ఆత్మ బలిదానం చేసుకునే దుస్థితికి కారణమైంది అప్పుడు కేంద్రంలో ఉన్న కాంగ్రెస్సేనని కేటీఆర్ ఆరోపించారు.

తెలంగాణ తేజం పాటను ఆవిష్కరించిన కేసీఆర్

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ తేజం పేరిట కేసీఆర్(కేశవ చంద్ర రమావత్) సినిమా కోసం రూపొందించిన పాటను మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆవిష్కరించారు. నటుడు రాకింగ్ రాకేష్ నిర్మించిన కేసీఆర్ సినిమాలోని ఆ పాటను శుక్రవారం నంది నగర్‌లోని కేసీఆర్ నివాసంలో జరిగిన ఆవిష్కరణ కార్యక్రమంలో ఎంపీ డి.దామోదర్ రావు, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, మధుసూదనాచారి, సంగీత దర్శకుడు చరణ్ అర్జున్, యాంకర్ జోర్దార్ సుజాత, సింగర్ విహ, గీత రచయిత సంజయ్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ ర్యాలీ

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో శనివారం ర్యాలీ జరగనుంది. రాష్ట్ర అవతరణ వేడుకలను బీఆర్ఎస్ పార్టీ మూడు రోజులు పాటు నిర్వహించాలని నిర్ణయించుకుంది. ఇందులో భాగంగా శనివారం సాయంత్రం పబ్లిక్ గార్డెన్స్ నుంచి అసెంబ్లీ ఎదుట ఉన్న అమరవీరుల స్థూపం వరకు ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ ర్యాలీలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుతోపాటు ఆ పార్టీకి చెందిన ముఖ్య నేతలంతా పాల్గొంటారు.

ట్యాపింగ్ వ్యవహారంలో కేసీఆర్‌పై దుష్ప్రచారం

- టీవీ, యూట్యూబ్ చానళ్లపై పోలీసులకు బీఆర్ఎస్ ఫిర్యాదు

బంజారాహిల్స్, మే 31 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్‌లో మాజీ సీఎం కేసీఆర్ పాత్ర లేకపోయినప్పటికీ కొన్ని టీవీ, యూట్యూబ్ చానళ్లు ఉద్దేశ్యపూర్వకంగా ఆయన పేరును బదనాం చేస్తున్నాయంటూ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ పార్టీ నేతలతో కలిసి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి ప్రభుత్వం కోరినట్లు ఇంటెలిజెన్స్ ఇతర విభాగాల అధికారులు నివేదికలు ఇచ్చారు తప్పితే ఫోన్ ట్యాపింగ్ విషయంలో కేసీఆర్ పాత్ర ఉన్నట్టు ఎక్కడా నిర్ధారణ కాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. అరెస్టయిన పోలీసు అధికారులు వాంగ్మూలం ఇచ్చారంటూ కేసీఆర్‌ను లక్ష్యంగా చేసుకొని కొన్ని టీవీ, యూట్యూబ్ చానళ్లు కేసీఆర్ పరువు ప్రతిష్ఠలకు భంగం కలిగించేలా విష ప్రచారం నిర్వహిస్తున్నాయని ఆరోపించారు. వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ మ్యాచ్ ఫిక్సింగ్

- ప్రజా సమస్యలు వదిలి.. ఫోన్ ట్యాపింగ్‌పై బీజేపీ దీక్షలా?
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీలు మ్యాచ్ ఫిక్సింగ్ రాజకీయాలు చేస్తున్నాయని.. దేశంలో శత్రువులుగా ఉంటున్న ఆ రెండు పార్టీలు తెలంగాణలో మిత్రులుగా వ్యవహరిస్తున్నాయని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్‌పై బీజేపీ దీక్ష చేపట్టడంపై శుక్రవారం ఆయన స్పందించారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలను పట్టించుకోకుండా ఫోన్‌ట్యాపింగ్‌పై దీక్ష చేయడం వెనుక ఉద్దేశం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందని, విపక్ష నాయకుల ఫోన్ల మీద కేంద్రం పెగాసస్ వాడిందన్న ఆరోపణలపై విచారణకు ఎందుకు డిమాండ్ చేయలేదో రాష్ట్ర బీజేపీ నాయకులు చెప్పాలన్నారు.

రాష్ట్రాన్ని లూటీ చేసేందుకే నకిలీ మద్యం: క్రిశాంక్

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్‌లో నకిలీ మద్యం అమ్ముతున్నారని సీజ్ చేసిన సోమ్ డిస్టిలరీస్ కంపెనీని రాష్ట్రాన్ని లూటీ చేసేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఇక్కడకు తెస్తోందని బీఆర్ఎస్‌నేత మన్నె క్రిశాంక్ ఆరోపించారు. మధ్యప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ విభాగానికి ఈ బీరు కంపెనీ.. రూ.575 కోట్ల రుణాన్ని ఎగవేసిందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత శాఖ వాస్తవాలు తెలుసుకోకుండా అటువంటి సంస్థకు ఎలా అనుమతిచ్చారని మంత్రి జూపల్లిని ప్రశ్నించారు.

గ్రూప్-1 ప్రిలిమ్స్ వాయిదా వేయండి: ఆర్ఎస్పీ

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష ఈ నెల 9న నిర్వహించొద్దని, ఆ పరీక్షను వాయిదా వేయాలని ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ నేత ఆర్.ఎస్ ప్రవీణ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. అదేరోజు ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) పరీక్ష కూడా ఉందని, చాలా మంది నిరుద్యోగులు ఐబీ పరీక్ష రాస్తున్నారని, ఎన్నికల కారణంగా పలువురు ప్రభుత్వ ఉద్యోగులు గ్రూప్-1 ప్రిలిమ్స్‌కు సన్నద్ధం కాలేదని తెలిపారు. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకొని పరీక్షను నెలరోజులు వాయిదా వేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

జోరుగా నిషేధిత బీటీ పత్తి విత్తనాల విక్రయాలు

- రెండు ముఠాలకు చెందిన ఐదుగురి అరెస్ట్



మహేశ్వరం ఎస్‌వోటీ పోలీసులు స్వాధీనం చేసుకున్న నిషేధిత పత్తివిత్తనాలు

హైదరాబాద్ సిటీ, మే 31 (ఆంధ్రజ్యోతి): నిషేధిత బీటీ పత్తివిత్తనాలను విక్రయిస్తున్న రెండు ముఠాలకు చెందిన ఐదుగురిని మహేశ్వరం ఎస్‌వోటీ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. వారి నుంచి సుమారు 1000 కిలోల బీటీ పత్తివిత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. నిషేధిత పత్తివిత్తనాల రవాణా జరుగుతోందన్న సమాచారంతో మహేశ్వరం ఎస్‌వోటీ, మాడ్గుల్ పోలీసులు కలిసి బ్రహ్మంపల్లి గ్రామం వద్ద నిఘా పెట్టారు. కారులో నిషేధిత పత్తి విత్తనాలు తరలిస్తున్న రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం కొత్త బ్రాహ్మణపల్లికి చెందిన దుగ్గిపూడి మారెడ్డి (58), అల్లం వినోద్ కుమార్ (42), అల్లం మారెడ్డిని అరెస్ట్ చేశారు. మరో ఘటనలో నాచారంలోని వైష్ణవి అగ్రిటెక్ సంస్థలో పనిచేస్తున్న షాద్‌నగర్‌కు చెందిన ఎర్రదొడ్డి నల్లపారెడ్డి సత్యపాల్‌రెడ్డి (52), కేశంపేటకు చెందిన అన్నపురెడ్డి మల్లారెడ్డి (44)ని అరెస్ట్ చేసి.. వారి నుంచి నిషేధిత పత్తి విత్తనాలు స్వాధీనం చేసుకున్నారు. రెండు ముఠాలకు చెందిన ఐదుగురిని అరెస్ట్ చేసి, వారి నుంచి సుమారు వేయి కిలోల నిషేధిత పత్తివిత్తనాలు, 5 ఫోన్లు, వేయింగ్ మిషన్, ఓ కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

నేడు గవర్నర్‌ను కలవనునన్న సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేడు(శనివారం) కలవనున్నారు. ఉదయం 10 గంటలకు రాజ్‌భవన్‌కు వెళ్లి... గవర్నర్‌తో సమావేశం కానున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొనాలని గవర్నర్‌ను సీఎం ఆహ్వానించనున్నారు. కాగా, మహారాష్ట్రలో రుణమాఫీ పథకం అమలు ఎలా జరిగిందనే విషయంపై అధ్యయనానికి రాష్ట్రం నుంచి మహారాష్ట్ర వెళ్లిన అధికారుల బృందం రాష్ట్ర ప్రభుత్వానికి త్వరలో నివేదిక ఇవ్వనుంది.

ట్యాపింగ్ కేసును సీబీఐకి ఇవ్వాలి

(మొదటిపేజీ తరువాయి)



కేసీఆర్‌తో లోపాయికారీ ఒప్పందం చేసుకుందా..? కేసీఆర్‌పై చర్య తీసుకోకపోవడానికి కారణమేంటి..? ప్రజలకు రేవంత్ సమాధానం చెప్పాలి" అని లక్ష్మణ్ డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందని, దానిని కక్కిస్తామని ఎన్నికల ముందు చెప్పిన రేవంత్.. ఇప్పుడు ఎందుకు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారో సమాధానం చెప్పాలని నిలదీశారు. ఫోన్ ట్యాపింగ్‌తో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంత దిగజారుడు రాజకీయాలకు పాల్పడిందో జైల్లో ఉన్న పోలీసు అధికారుల నేరాంగీకార పత్రాలను పరిశీలిస్తే అర్థమవుతోందని లక్ష్మణ్ అన్నారు. ఫోన్ ట్యాపింగ్‌తో వ్యాపారులను హింసించి డబ్బులు వసూలుచేశారని మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఫోన్ ట్యాపింగ్ సూత్రధారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, బీఎల్ సంతోష్‌పై పెట్టిన కేసులను పరిశీలించాలని మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ డిమాండ్ చేశారు.

రూ.2,000 కోట్లు అప్పు తీసుకోనున్న రాష్ట్రం

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.2,000 కోట్లు అప్పు తీసుకోనుంది. ఈ మేరకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు శుక్రవారం ఇండెంట్ పెట్టింది. 16 ఏళ్ల కాల పరిమితితో రూ.1,000 కోట్లు, 19 ఏళ్ల కాల పరిమితితో మరో రూ.1,000 కోట్లను రుణంగా తీసుకోనుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూ.4,000 కోట్ల అప్పు కోసం ఇండెంట్ పెట్టింది. తెలుగు రాష్ట్రాలు సహా దేశంలోని 11 రాష్ట్రాలు రూ.19,500 కోట్ల అప్పుల కోసం ఆర్‌బీఐని ఆశ్రయించాయి. జూన్ 4న జరిగే ఈ-వేలం ద్వారా ఈ అప్పులు తీసుకోనున్నాయి.

కేసీఆర్‌ను కాపాడేందుకే బీజేపీ నేతల ధర్నాలు

- అందుకే సీబీఐ విచారణ కోరుతున్నరు: ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కాపాడేందుకే ఆ పార్టీ మిత్రపక్షమైన బీజేపీ.. సీబీఐ విచారణ కోరుతోందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆరోపించారు. ఈ కేసును సీబీఐకి అప్పగించాలంటూ బీజేపీ నిరసన చేపట్టడం చూస్తుంటే ఆశ్చర్యం కలుగుతోందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి కొమ్ము కాసినందుకు ప్రతిఫలంగా కేసీఆర్‌ను కాపాడాలని ఆ పార్టీ చూస్తోందన్నారు. ట్యాపింగ్ కేసు నుంచి కేసీఆర్‌ను కాపాడడం ఎవరి తరమూ కాదన్నారు. ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో బీఎల్ సంతోష్‌ను ఇరికించారని చెబుతున్న బీజేపీ.. దాన్ని ఎందుకు నిరూపించలేకపోయిందన్నారు. బీఆర్ఎస్‌ను బీజేపీ అనుబంధ సంస్థగా మార్చేశారనిఎద్దేవా చేశారు. ట్యాపింగ్ కేసులో కేసీఆర్, కేటీఆర్‌లను కాపాడేందుకే బీజేపీ నేతలు ధర్నాలు చేస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్‌పై టీపీసీసీ అధ్యక్షుని హోదాలో రేవంత్‌రెడ్డి.. అప్పట్లోనే కేంద్రానికి ఫిర్యాదు చేశారని గుర్తుచేశారు. అసలు మోదీ ప్రభుత్వమే ఫోన్ ట్యాపింగ్‌లు చేస్తుందన్న ఆరోపణలూ ఉన్నాయన్నారు. ముందు ఆ ఆరోపణలపై సీబీఐ విచారణ చేయించుకోవాలని హితవు పలికారు.

అక్టోబరులో స్థానిక ఎన్నికలు!

ఒకేసారి పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు.. రుణమాఫీ పూర్తయ్యాకే నిర్వహించే అవకాశం

- అప్పటికి బీసీ రిజర్వేషన్లూ కొలిక్కి తెచ్చే కసరత్తు



హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలతోపాటు ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకూ ఒకే సారి ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. రుణమాఫీ ప్రక్రియను పూర్తి చేయడంతోపాటు బీసీ రిజర్వేషన్ల అంశం తేలాకే ఈ ఎన్నికలకు వెళ్లాలన్న యోచనలో సర్కారు ఉన్నట్లు తెలిసింది. వాస్తవానికి లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత జూన్‌లో పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే, బీసీ రిజర్వేషన్ల విషయం తేలకపోవడం, కులగణనకు ఇంకా సమయం పట్టే అవకాశం ఉండడంతో తర్జన భర్జన పడుతోంది. కులగణన వివరాల ప్రకారం కాకుండా.. కేవలం ఓటరు జాబితాలో పేర్కొన్న కులాల వారీగా రిజర్వేషన్లను లెక్కగట్టి ఎన్నికలకు వెళ్తే.. కోర్టుల్లో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తోంది. మరోవైపు ఆగష్టు 15లోపు రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. రుణమాఫీ పూర్తయితే ప్రజల్లో సానుకూలత పెరుగుతుందని ఆ పార్టీ భావిస్తోంది. అప్పటిలోగా కులగణనపైనా స్పష్టత వస్తుందని, అక్టోబరులో ఎన్నికలను నిర్వహిస్తే బాగుంటుందనే ఆలోచనలో ప్రభుత్వం ఉంది.

రిజర్వేషన్ల ఖరారుపై సమాలోచన

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలంటే ముందుగా బీసీ రిజర్వేషన్లను ఖరారు చేయాల్సి ఉంది. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీలకు జనాభా దామాషా ప్రకారం రాజ్యాంగ బద్ధంగా రిజర్వేషన్లను కల్పిస్తున్నారు. బీసీలకు మాత్రం ఆయా రాష్ట్రాలు వాటి విచక్షణ మేరకు రిజర్వేషన్లు కల్పిస్తూ ఎన్నికలను జరుపుతున్నాయి. స్థానిక ఎన్నికల్లో బీసీ జనాభా దామాషా మేరకు రిజర్వేషన్లను పెంచాలనే డిమాండ్ కొన్నేళ్లుగా ఉంది. అయితే, రిజర్వేషన్లు 50శాతం కంటే మించకూడదని గతంలో సుప్రీం కోర్టు స్పష్టమైన ఆదేశాలను జారీచేసింది. దీంతో ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగబద్ధ విధానంలో జనాభా దామాషా ప్రకారం పోగా.. మిగిలింది బీసీలకు కేటాయించాల్సి రావడమే సమస్యగా పరిణమించింది. ఈ విధానం కోసమైతే ఓటరు జాబితాను పరిశీలించి, వివరాలు సేకరిస్తే రిజర్వేషన్లను నిర్ణయించవచ్చు. అయితే, అప్పుడు తమకు రిజర్వేషన్ తగ్గిందనే అంశంపై బీసీలు సహా ఎవరైనా కోర్టుకు వెళ్తే మొత్తం ఎన్నికలపైనా ప్రభావం చూపే అవకాశం ఉంది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 34 నుంచి 23 శాతానికి తగ్గించింది. ఇదే విధానంలో 2019లో స్థానిక ఎన్నికలను నిర్వహించింది. అప్పుడు కొంతమంది కోర్టుకు వెళ్లడంతో.. ఆ ప్రభుత్వాన్ని కోర్టు ఈ విధానంలో ఎందుకు వెళ్లారంటూ మందలించింది. ఈ ఒక్కసారికి అనుమతించాలని, తరువాత నిర్వహించబోయే ఎన్నికలకు రిజర్వేషన్లను తేల్చి, దాని ప్రకారమే నిర్వహిస్తామని గత ప్రభుత్వం కోర్టుకు చెప్పింది. కానీ, ఆతర్వాత ఇందుకు అవసరమైన చర్యలను తీసుకోకపోవడం ప్రస్తుత ప్రభుత్వానికి సమస్యగా మారింది. మరోవైపు.. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఖరారు చేయాల్సిన బీసీ రిజర్వేషన్ల అంశంపై సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన వకుళాభరణం కృష్ణమోహన్ నేతృత్వంలోని పూర్తిస్థాయి డెడికేటెడ్ కమిషన్ (బీసీ కమిషన్) కృషి చేస్తోంది. కుల సంఘాలతో పాటు, నిపుణులు, ప్రొఫెసర్లతో వరుస సమావేశాలను జరుపుతోంది. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ముగియగానే ఇందుకు సంబంధించిన పలు అంశాలను సీఎంతోనూ చర్చించి, ఒక నివేదికను సిద్ధం చేయనున్నట్టు సమాచారం. కాగా, ఆగస్టులో ప్రస్తుత బీసీ కమిషన్ పదవీకాలం ముగియనుంది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కమిషన్‌నే కొనసాగిస్తుందా, లేక కొత్త కమిషన్‌ను నియమిస్తుందా అన్నది తెలియాల్సి ఉంది.

ఒకే సారి నిర్వహిస్తే...

సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు మూడు దఫాల్లో నిర్వహిస్తే.. మూడుసార్లు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుంది. ఇప్పటికే రాష్ట్రంలో గత ఏడాది అక్టోబరు నుంచి ఇప్పటి వరకు ఏదో ఒక ఎన్నిక జరుగుతుండగా.. నెలలపాటు కోడ్ అమల్లో ఉంది. దీంతో ప్రభుత్వ పనులు ఆలస్యమవడంతో పాటు, సామాన్య జనానికి కొంత ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఈ పరిస్థితి మళ్లీ పునరావృతం కాకూడదంటే పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ఒకే సారి నిర్వహించాలన్న యోచనలో ప్రభుత్వం ఉంది. ఈ మూడు ఎన్నికలకు రిజర్వేషన్ల అంశం ముడిపడి ఉన్నాయని, జూన్ నుంచి ఆగస్టు వరకు సమయం ఉంటే ఈ అంశాన్ని తేల్చేసే అవకాశం ఉంటుందని సర్కారు భావిస్తోంది. ఎవరికీ ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఎన్నికలను నిర్వహించాలన్న ఆలోచనలోనే సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నట్టు సమాచారం. ఈ మేరకు రిజర్వేషన్ల అంశం కొలిక్కి వస్తే.. సెప్టెంబరు లేదా అక్టోబరులో మూడు ఎన్నికలతో గ్రామీణ ప్రాంతాల్లో తీన్ మార్ మోగనుంది.

రూపు మారనున్న మాతా శిశు సంరక్షణ పథకం

కేసీఆర్ కిట్ ఔట్.. ఎంసీహెచ్ కిట్ ఇన్

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): మాతాశిశు సంరక్షణకు గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన కేసీఆర్ కిట్ పేరును ఇప్పటికే రేవంత్ సర్కారు తొలగించింది. దాని స్థానంలో మదర్ అండ్ చైల్డ్ హెల్త్(ఎంసీహెచ్) కిట్ పేరుతో అమలు చేస్తోంది. అంతేకాక ఈ పథకం రూపురేఖల్ని పూర్తిగా మార్చేయబోతోంది. ప్రధానంగా దీన్ని ఎలా నిర్వహించాలన్న దానిపై కసరత్తు ప్రారంభించింది. పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పథకాన్ని నడపాలా? లేక కేంద్రం ఇచ్చే ప్రధాన మంత్రి మాతృవందన యోజన(పీఎంఎంవీవై)తో కలిపి కొనసాగించాలా అన్నదానిపై చర్చిస్తున్నారు. ఈ పథకంపై ఇటీవలే వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సమీక్ష నిర్వహించారు. ఎన్నికల కోడ్ కారణంగా దీనిపై ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది. కోడ్ ముగియగానే కేంద్రం భాగస్వామ్యంతోనా... లేక రాష్ట్ర ప్రభుత్వ నిధులతో దీన్ని నిర్వహిస్తారా అన్న దానిపై స్పష్టత రానుంది.

రాష్ట్ర ప్రభుత్వంపై భారం తగ్గే ఛాన్స్

ప్రస్తుతం పీఎంఎంవీవై కింద కేంద్రం గర్భిణులకు రూ.6 వేల ఆర్థిక సాయాన్ని ఇస్తోంది. కేంద్రం ఇచ్చే నిధులను తీసుకొని.. దానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున కొంత జమ చేస్తే... పాత పద్ధతిలోనే ఎంసీహెచ్ కిట్ కింద రూ. 13 వేలు ఇవ్వవచ్చు. కేంద్ర ప్రభుత్వ పథకంతో కలిపి అమలుచేయడం వల్ల రేవంత్ సర్కారుపై ఆర్థిక భారం కూడా సగానికిపైగా తగ్గుతుంది. ఇదే విషయాన్ని అధికారులు మంత్రికి వివరించినట్లు తెలుస్తోంది. కాకపోతే కేంద్రం నిధులను ఈ పథకం కింద వినియోగిస్తే... కచ్చితంగా పేరు, బ్రాండింగ్‌లో వారి నియమ నిబంధనలను పాటించాల్సివుంటుందని అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చినట్లు తెలుస్తోంది. దీంతో రెండు రకాల ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, జూన్ 4 తర్వాత తుది నిర్ణయం తీసుకుందామని అధికారులకు మంత్రి సూచించినట్లు చెప్తున్నారు.

తెలంగాణ చిహ్నంలో అమరుల స్థూపం పెడితే.. మీకెందుకు బాధ?

- కీరవాణికి ఆస్కార్ వచ్చినప్పుడు.. కేసీఆర్, కేటీఆర్ అభినందించలేదా?
- మహేష్ కుమార్ గౌడ్
- సమ్మక్క, సారలమ్మలను చంపింది కాకతీయరాజులు కాదా?: బెల్లయ్యనాయక్

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): "ఉద్యమకారుల అభిప్రాయం మేరకు తెలంగాణ చిహ్నంలో అమరవీరుల స్థూపం పెడితే మీకెందుకు కడుపు నొప్పి?" అంటూ బీఆర్ఎస్ నేతలను టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ ప్రశ్నించారు. నిజమైన తెలంగాణ వాదులు కోరుకున్న దిశగా కాంగ్రెస్ ప్రభుత్వ అడుగులు పడుతుంటే.. కేసీఆర్ కుటుంబం నానా యాగీ చేయాలని చూస్తుందన్నారు. టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ అమరుల స్థూపానికి రూ. వంద కోట్లు వెచ్చించిన కేసీఆర్ ప్రభుత్వం.. అందులో ఒక్క అమరవీరుని పేరయినా చెక్కిందా అని ప్రశ్నించారు. చిన జీయర్ స్వామిని తీసుకువచ్చి కుర్చీలో కూర్చోపెట్టినప్పుడు, అందెశ్రీ గీతాన్ని సీమాంధ్ర గాయకుడు రామకృష్ణతో పాడించినప్పుడు, ప్రభుత్వ అంబాసిడర్లుగా రకుల్ ప్రీత్ సింగ్, మంచు లక్ష్మి, పుల్లెల గోపీచంద్‌లను నియమించినప్పుడు, రోజా ఇంటికి వెళ్లి ఆంధ్రా బిర్యానీని తిన్నప్పుడు, పనికిరాని ఒక ప్రాజెక్టును కట్టి.. దాని ప్రారంభోత్సవానికి ఏపీ సీఎంను ఆహ్వానించినప్పుడు, శారదాపీఠానికి తెలంగాణలో భూములు ఇచ్చినప్పుడు కేసీఆర్‌కు సెంటిమెంటు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. కీరవాణికి ఆస్కార్ అవార్డు వస్తే.. ఇదే కేసీఆర్, కేటీఆర్ ట్విట్టర్ వేదికగా అభినందించారని గుర్తు చేశారు. ఒక మంచి గీతానికి సంగీతం సమకూర్చేందుకు కీరవాణిని సంప్రదిస్తే.. నానా యాగీ చేస్తున్నారని విమర్శించారు. కీరవాణి ఎంపిక అన్నది అందెశ్రీ ఆలోచనేనని వెల్లడించారు. మెజారిటీ ప్రజల అభిప్రాయం ప్రకారం తెలంగాణ చిహ్నం ఎంపిక జరుగుతుందన్నారు. మల్లు రవి మాట్లాడుతూ 2023 ఎన్నికలకు ముందే.. టీపీసీసీ అధ్యక్షుని హోదాలో రేవంత్‌రెడ్డి రాచరిక పాలన తీసేసి ప్రజా పాలన తీసుకువస్తామని చెప్పారని, అందులో భాగమే రాచరిక చిహ్నాల తీసివేతన్నారు. ప్రజా పాలనలో భాగంగానే జయజయహే తెలంగాణ పాటని అధికారిక గేయంగా చేస్తున్నట్లు చెప్పారు."తెలంగాణ చిహ్నంలో కాకతీయుల కళాతోరణం కావాలా...?అమరవీరుల స్థూపం వద్దా? సమ్మక్క, సారలమ్మలను చంపింది కాకతీయ రాజులు కాదా? నాతో సహా.. రాష్ట్రంలో 12% ఉన్న గిరిజనులు కాకతీయ కళాతోరణాన్ని ఎందుకు ఒప్పుకోవాలి?" అంటూ టీపీసీసీ ఆదివాసీ సెల్ ఛైర్మన్ బెల్లయ్య నాయక్ ప్రశ్నించారు. అందెశ్రీ రాసిన జయజయహే తెలంగాణ గేయం విషయంలో దేశపతి శ్రీనివాస్, వి. ప్రకాష్ కోడిగుడ్డుపై ఈకలు పీకే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. "అందెశ్రీ కాల్ రికార్డింగ్‌లను విడుదల చేస్తారా? ఇద్దరు వ్యక్తులు మాట్లాడుకున్న ప్రైవేటు డిస్కషన్ రికార్డును ఎలా విడుదల చేస్తారు?" అంటూ ధ్వజమెత్తారు.

పిల్లల కోసం బెంగ!

3 రోజులుగా శిశు విహార్ వద్దే పెంపుడు తల్లిదండ్రుల నిరీక్షణ

- అన్నం తింటున్నారో లేదో.. ఆరోగ్యం ఎలా ఉందో అంటూ కన్నీళ్లు
- ఒక్కసారి చూస్తాం.. లోపలికి అనుమతించండి అని వేడుకోలు
- లోపల ఉన్న 14 మంది చిన్నారుల్లో ఇద్దరు పిల్లలకు జ్వరం?
- 'కారా' రూల్స్ సడలించాలంటున్న స్వచ్ఛంద సంస్థలు
- విచారణ ముగిసేదాకా పిల్లలను చూసే అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి
- సొంత తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి.. పిల్లలను అప్పగించండి:మంత్రి సీతక్క

హైదరాబాద్ సిటీ/యూసుఫ్‌గూడ, పంజాగుట్ట, మే 31 (ఆంధ్రజ్యోతి): నవమాసాలు మోసి కన కున్నా.. ఆ పిల్లలను ఆ తల్లులు ప్రాణానికి ప్రాణంగా పెంచుకున్నారు. వారే లోకంగా బతుకుతున్నారు. అలాంటిది.. తమ వద్ద నుంచి పిల్లలను దూరంచేస్తే ఆ తల్లిండ్రులు బాధపడరా? పది నిమిషాలు కనిపించకపోతేనే తల్లడిల్లిపోయే స్థితిలో మూడు రోజులుగా పిల్లలను చూడకుండా ఉన్న ఆ తల్లిదండ్రుల ఆవేదన ఏ స్థాయిలో ఉంటుంది? ఇదంతా యూసుఫ్‌గూడలోని శిశువిహార్ పరిసరాల్లో కళ్లకు కడుతోంది. నిజమే.. సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ (కారా) నిబంధనలకు విరుద్ధంగా దత్తత తీసుకొని తప్పే చేశాం అంటూ లెంపలేసుకొంటూనే.. తమ బిడ్డల్ని ఒక్కసారి చూపించండి అంటూ అధికారులను తల్లిదండ్రులు ప్రాధేయపడుతున్నారు. శిశువుల విక్రయానికి సంబంధించి అంతర్రాష్ట్రముఠా గుట్టురట్టవ్వడంతో మూడు రోజుల క్రితం వివిధ చోట్ల నుంచి 14మంది శిశువులు, చిన్నారులను పోలీసులు స్వాధీనం చేసుకొని యూసుఫ్‌గూడలోని శిశువిహార్‌లో అప్పగించారు. వీరిలో 12 మంది నెలల వయసు పిల్లలుండగా ఇద్దరు మూడేళ్లలోపు ఉన్నారు. శిశు విహార్‌లో ఉన్న తమ చిన్నారులు ఎలా ఉన్నారో? అన్నం తింటున్నారో లేదో? ఆరోగ్యం ఎలా ఉందో? అనే ఆలోచనతో పెంపుడు తల్లిదండ్రులు ఆకలిదప్పులూ పట్టకుండా బెంగటిల్లుతున్నారు. పిల్లలు వైద్యులపర్యవేక్షణలో ఉన్నా కొందరు జ్వరంతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది.

దత్తత ప్రక్రియ ఆలస్యం.. సంక్లిష్టం!

పొరుగు రాష్ట్రాలతో పోల్చితే తెలంగాణ, ఏపీలో పిల్లల దత్తత ప్రక్రియలో తీవ్ర ఆలస్యం జరుగుతుంది. ఈ కారణంగానే పిల్లలు లేని దంపతులు నిబంధనలకు విరుద్ధంగా శిశువులను దత్తత తీసుకుంటున్నట్లు సమాచారం. మహారాష్ట్ర, కర్ణాటకలో దరఖాస్తు చేసుకున్న ఆరు నుంచి ఏడాదిలోపు పిల్లల దత్తత ప్రక్రియ పూర్తవుతుంది. తెలుగు రాష్ట్రాల్లో మాత్రం రెండు, మూడేళ్లు పడుతోందని స్వచ్ఛంద సంస్థల బాధ్యులు చెబుతున్నారు. పిల్లలను దత్తత తీసుకోవాలంటే తొలుత.. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన కారా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. తర్వాత పాన్‌కార్డు నంబర్, రెసిడెన్స్ ప్రూఫ్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, వివాహ నమోదు పత్రం, దంపతుల బర్త్, హెల్త్ సర్టిఫికెట్లు సమర్పించాలి. భార్యాభర్తల పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతోపాటు ఇద్దరు కలిసి దిగిన పెళ్లి ఫొటోను కూడా దరఖాస్తుతో సమర్పించాలి. అలాగే రూ.6వేల డీడీ అప్లికేషన్ ఫారంతోపాటు రూ.40 వేలు దత్తత తీసుకునే సమయంలో సంబంధిత అనాథాశ్రమానికి లేకుంటే ప్రభుత్వ సంస్థలకు చెల్లించాలి. దరఖాస్తు చేసుకున్న అనంతరం రెండు నుంచి మూడేళ్లకు పిల్లలను దంపతులకు అప్పగిస్తారు. అప్పగించిన తర్వాత కూడా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు పిల్లలను పర్యవేక్షించాలి. దత్తత తీసుకున్న జంటల ఆర్థిక పరిస్థితి ఎలా ఉంది? వారు పిల్లాడిని బాగా చూసుకుంటున్నారా? లేదా? అనేవి ప్రతి ఆరు నెలలకోసారి పరిశీలించాలి. ఈ సందర్భంగా సదరు తల్లిదండ్రుల నుంచి ఆరునెలలకోసారి రూ.2వేల చొప్పున తీసుకుంటారు.

"

3 రోజులుగా పడిగాపులు పడుతున్నాం


నా పేరు అరుణ. భర్త పేరు సాయి. మాది ఏపీలోని చీరాల సమీపంలోని బోయనపాలెం. పిల్లలు కలగకపోవడంతో ఐదు నెలల బాబును ఓ నర్సు ద్వారా తెచ్చుకున్నాం. బాబుకు శ్రీమన్విత్ అని పేరు పెట్టుకున్నాం. మా అమ్మకు నేను ఒక్కదాన్నే కావడంతో ఆమె ఎంతో ప్రేమతో నా బాబుకు ఎకరంన్నర పొలం రాసేందుకు సిద్ధమైంది. ఇంతలోనే పోలీసులు మా బాబును తీసుకొచ్చి శిశువిహార్‌లో పెట్టారు. 3 రోజులుగా ఇక్కడే ఉన్నాం. చూసేందుకు అవకాశం ఇవ్వడం లేదు. దయచేసి మా బాబును మాకు ఇప్పించండి. - అరుణ, చీరాల, ఏపీ

3 నెలల్లోపు దత్తత ఇవ్వాలి

సమాజంలో చాలా జంటలు సంతానలేమి సమస్యతో బాధపడుతున్నారు. అలాంటి వారికి పిల్లలను దత్తత తీసుకునే అవకాశాన్ని త్వరగా కల్పించాలి. కారా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకున్నాక మూడు నెలల్లో చట్టబద్ధంగా దత్తత ప్రక్రియ పూర్తి అయ్యేలా నిబంధనలు సడలించాలి. దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా త్వరగా పరిష్కరించాలి. ప్రస్తుతం యూసుఫ్‌గూడలోని శిశువిహార్‌లో ఉంటున్న పిల్లలను చూసే అవకాశాన్ని మానవతా దృక్పథంతో తల్లిదండ్రులకు కల్పించాలి.

-డాక్టర్ మమతా రఘువీర్,
తరుణి స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు

ప్రతి జిల్లాలో శిశువిహార్ పెట్టాలి



దత్తత కార్యక్రమం ఆలస్యమవుతుండడంతోనే చాలా మంది పిల్లలను అక్రమ పద్ధతిలో కొనుగోలు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం దత్తత టైం లిమిట్ తగ్గించి సకాలంలో పిల్లలను అప్పగిస్తే దంపతులు సంతోషంగా ఉండటంతోపాటు సంరక్షణను బాధ్యతగా నెరవేరుస్తారు. ప్రభుత్వం కూడా ప్రతి జిల్లాలో శిశువిహార్ కేంద్రాలు పెట్టాలి. తద్వారా అనాథ పిల్లలకు ఆశ్రయం అందుతోంది.

-రేవతి, హైకోర్టు న్యాయవాది

పాప పేరిట ఆస్తి కూడా రాశాం



ఈ దంపతులు పేర్లు పెరుగు దుర్గాభవాని, చక్రపాణి. వీరిది ఏపీలోని బాపట్ల జిల్లా కర్లపల్లి మండలం చింతాయపాలెం. పెళ్లయి 20 ఏళ్లయినా సంతానం కలగకపోవడంతో మూడేళ్ల క్రితం విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నర్సు సాయంతో 8 రోజుల పాపను రూ.1.5 లక్షలకు కొనుగోలు చేశారు. అధికారులొచ్చి తమ పాపను తీసుకెళ్లడంతో శిశువిహార్ వద్ద పడిగాపులు పడుతున్నారు. పాపకు భవ్యశ్రీ అని పేరు పెట్టుకొని, మూడేళ్లుగా పెంచుకుంటున్నామని.. ప్రాణం కంటే ఎక్కువగా చూసుకున్నామని చెప్పారు. "పాప పేరిట ఆస్తిని అంతా రాశాం. మంత్రి సీతక్క ఆఫీస్ అడ్రస్ చెప్పండి సార్.. అక్కడికి వెళ్లి అమ్మను ప్రాధేయపడి పాపను తీసుకెళ్తాం" అని ఈ దంపతులు అడుగుతున్నారు.

అక్రమ రవాణాపై కఠిన చర్యలు : సీతక్క



పిల్లల అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. శుక్రవారం యూసుఫ్‌గూడలోని శిశువిహార్ కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పోలీసులు స్వాధీనం చేసుకున్న చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల కుటుంబసభ్యుల వివరాలు సేకరించి, వారికి కౌన్సిలింగ్ ఇచ్చి చిన్నారులను అప్పగించాలని సూచించారు. సంతానం లేని దంపతులు ప్రభుత్వ అనుమతితో, చట్టపరంగా దత్తత తీసుకుంటే ఎలాంటి ఇబ్బందులు ఉండవని, దత్తత కోసం చట్టపరమైన ప్రక్రియను అనుసరించాలని పేర్కొన్నారు. పిల్లల అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఆశ వర్కర్లకు పరీక్ష విధానాన్ని రద్దు చేయాలి

- సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి వర్ధం పర్వతాలు

- ఆశ వర్కర్లతో కలిసి కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందజేత



కలెక్టరేట్ పరిపాలనాధికారి చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆశ వర్కర్లు, సీఐటీయూ నాయకులు

నాగర్‌కర్నూల్ టౌన్, మే 31: రాష్ట్రంలో ఇరవై ఏళ్లుగా పని చేస్తున్న ఆశ వర్కర్లకు పరీక్ష పెట్టే విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి వర్ధం పర్వతాలు డిమాండ్ చేశారు. శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశ వర్కర్లు కలెక్టరేట్ పరిపాలనాధికారి చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా కాలంలో ఆశ వర్కర్లకు అందించిన ఆరోగ్య సేవలకు ప్రపంచ ఆరోగ్య సంస్థ హెల్త్ గ్లోబల్ లీడర్స్ అని ప్రశంసించిందని పేర్కొన్నారు. ఆశ వర్కర్ల సీనియారిటీని పరిగణలోకి తీసుకోకుండా పరీక్ష పెట్టడం దుర్మార్గమైన చర్య అన్నారు. కొత్తగా పరీక్షలు నిర్వహించి రూ.5 వేలు వేతనం ఇస్తామనడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వం వెంటనే పరీక్ష విధానం ఉపసంహరించుకోవడంతో పాటు ఎన్నికల విధుల రెమ్యునరేషన్ చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పొదిల రామయ్య, కోశాధికారి అశోక్, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు శ్రీదేవి, నాయకులు సువర్ణ, పార్వతమ్మ, గౌరమ్మ, నిర్మల, జ్యోతి, మాణిక్యమ్మ, పద్మ, బంగారమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఉద్యోగికి పదవీ విరమణ తప్పదు



ఎంపీడీవో లక్ష్మణ్‌రావు దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

ఉప్పునుంతల, మే 31: ప్రతీ ఉద్యోగికి పదవీ విరమణ తప్పదని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కొత్త యశోద ఫంక్షన్ హాల్‌లో ఎంపీపీ అరుణ అధ్యక్షతన ఎంపీడీవో లక్ష్మణ్‌రావు పదవీ విరమణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రతీ ఉద్యోగి తను సర్వీసులో ఆయన చేసిన సేవలే ప్రజల్లో నిలిచి ఉండి పోతాయన్నారు. అంకితభావంతో పనిచేస్తే ఉద్యోగి ప్రతీ ఒక్కరు గుర్తించుకుంటారని ఆయన కొనియాడారు. అనంతరం ఎంపీడీవో లక్ష్మణ్‌రావు దంపతులను ఎమ్మెల్యేతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, జర్నలిస్టులు శాలువాతో సన్మానం చేశారు. జడ్పీటీసీ సభ్యుడు అనంతప్రతాప్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ భూపాల్‌రావు, తహసీల్దార్ శ్రీకాంత్, నాయకులు రఘుపతిరెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ, అనంతారెడ్డి, చిన్న జంగిరెడ్డి, మాజీ సర్పంచ్ చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన కాంగ్రెస్ నాయకులు



శంషాబాద్ విమానాశ్రయంలో ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

ఊర్కొండ, మే 31: జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి విదేశీ యాత్ర ముగించుకొని శుక్రవారం ఉదయం శంషాబాద్ చేరుకున్నారు. ఈ సందర్భంగా విమానాశ్రయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు స్వాగతం పలికారు. అనంతరం పలు విషయాలపై చర్చించారు. కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సమి, యువజన కాంగ్రెస్ మండల పార్టీ మాజీ అధ్యక్షుడు మనోహర్ రెడ్డి నాయకులు వహీద్, ఆదినారాయణ తదితరులు ఉన్నారు.

మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పిస్తాం

కల్వకుర్తిటౌన్, మే 31 : మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పిస్తామని కల్వకుర్తి డిపో మేనేజర్ వి.సుభాషిణి అన్నారు. శుక్రవారం ఉదయం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి విశేష స్పందన వచ్చిందని ఆమె పేర్కొన్నారు. వివిధ ప్రాంతాలనుంచి 20 మంది ప్రయాణికులు ఫిర్యాదులు, సలహాలు ఇచ్చారని తెలిపారు. మహబూబ్‌నగర్‌కు బస్సుల సంఖ్యను పెంచాలని కల్వకుర్తికి చెందిన సతీష్‌రెడ్డి కోరారని, నర్సంపల్లి, గుండ్లగుంటపల్లి, ఊర్కొండపేట, ఊర్కొండ మీదుగా మహబూబ్‌నగర్ కేంద్రానికి బస్సులను నడపాలని నర్సంపల్లి గ్రామస్థులు కోరారన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. సీఐ శ్వేత, ఉద్యోగ సంక్షేమసంఘం నాయకుడు సురేందర్, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెంచుల కోసం దేశీయ నాటుకోళ్ల పంపిణీ



చెంచులకు నాటుకోళ్లను పంపిణీ చేస్తున్న కోనేరు సంస్థ ప్రాజెక్టు మేనేజర్ ఇస్మాయిల్

లింగాల, మే 31 : చెంచు గిరిజనుల ఆర్థిక పరిపుష్టి కోసం దేశీయ నాటుకోళ్ల పెంపకం దోహదపడుతుందని కోనేరు సంస్థ ప్రాజెక్టు మేనేజర్ ఇస్మాయిల్ అన్నారు. శుక్రవారం కోనేరు సంస్థ ఆధ్వర్యంల పద్మన్నపల్లి గ్రామంలో పది మంది నిరుపేద ఆదివాసి చెంచు గిరిజనుల కుటుంబాలకు ఒక్కొక్కరికి 5దేశీయ నాటుకోళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నాటు కోళ్లను ఇస్తే వాటిని పెంచుకుని వృద్ధి చేసుకుని తద్వారా వాటిని అమ్ముకుని జీవనోపాధి పొందడమే సంస్థ ఉద్దేశ్యమన్నారు. చెంచులు ఆర్థికంగా రాణించేందుకు కోనేరు సంస్థ అన్ని విధాలా తోడ్పాటునందిస్తుందని పేర్కొన్నారు. బయ్యన్న, చిట్టెమ్మ, సలేశ్వరం, రాము, గురువయ్య, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి

-కొత్త ప్లాంట్‌ను ఏర్పాటు చేసి చెంచుల తాగునీటి సమస్య తీర్చాలి

లింగాల, మే 31 : మండల పరిధిలోని అప్పాయిపల్లి గ్రామ చెంచు గిరిజనుల కాలనీలో ఐటీడీఏ ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ధ్వంసం చేసిన వారిపై చట్టప్రకారంగా చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు యాదగిరి సలేశ్వర, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సురేందర్‌రావు, నిరంజన్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించిన తర్వాత చెంచు గిరిజనులతో కలిసి వారు మాట్లాడారు. గత రెండు సంవత్సరాల క్రితం ఐటీడీఏ ఆధ్వర్యంలో చెంచు గిరిజనులకు శుద్ధ జలం అందించడానికి మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసిందన్నారు. చెంచు గిరిజనులతో పాటు గ్రామ ప్రజలకు కూడా దాహార్తి తీర్చుతూ స్వచ్ఛమైన నీటినందించే ఈ వాటర్ ప్లాంట్‌ను ఉద్దేశపూర్వకంగా కాలనీలో నివాసం ఉంటున్న నిమ్మల సలేశ్వరం అనే అతను ట్రాక్టర్ డోజర్‌తో ధ్వంసం చేశారని తెలిపారు. గ్రామపంచాయతీ బోరు ద్వారా మినరల్ వాటర్ ప్లాంట్‌కు నీటినందించి, శుద్ధి చేసిన జలాన్ని ప్రజలు వాడేవారన్నారు.

ఇట్టి వాటర్ ప్లాంట్‌ను ధ్వంసం చేయడం వల్ల చెంచు గిరిజనులకు నీటిపాట్లు తప్పడం లేదని వాపోయారు. చెంచులకు భయభ్రాంతులకు గురి చేస్తూ మినరల్ వాటర్ ప్లాంట్‌ను ధ్వంసం చేసిన వ్యక్తిపై చట్ట ప్రకారంగా చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా కొత్త ప్లాంట్ ఏర్పాటు చేసి తాగునీటి వసతి కల్పించాలని కోరారు.

ఉత్కంఠకు తెర

- కొల్లాపూర్ మునిసిపల్ చైర్‌పర్సన్‌గా మేకల రమ్య ఏకగ్రీవ ఎన్నిక

- హాజరైన మంత్రి జూపల్లి, ఎమ్మెల్సీ కూచకుళ్ల



మేకల రమ్యను సన్మానిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, చిత్రంలో ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి

కొల్లాపూర్, మే 31: కొల్లాపూర్ మునిసిపాలిటీ చైర్ పర్సన్ పదవి ఎవరు చేపతారన్న ఉత్కంఠకు శుక్రవారం తెరపడింది. కొల్లాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని 6వ వార్డు కౌన్సిలర్ మేకల రమ్య మునిసిపల్ చైర్‌పర్సన్‌గా శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గత నెలలో కొల్లాపూర్ మునిసిపల్ బీఆర్ఎస్ చైర్ పర్సన్ రఘుప్రోలు విజయలక్ష్మిపై కాంగ్రెస్ కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. దీంతో తిరిగి నూతన చైర్ పర్సన్‌ను ఎన్నుకునేందుకు కలెక్టర్ ఆదేశానుసారం కొల్లాపూర్ పట్టణంలోని నూతన గ్రంథాలయ భవనంలో కల్వకుర్తి ఆర్డీవో శ్రీను పర్యవేక్షణలో జరిగిన నూతన చైర్‌పర్సన్ ఎన్నికలో మేకల రమ్యను కాంగ్రెస్ కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమానికి రాష్ట్ర ఎక్సైజ్, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి హాజరయ్యారు. చైర్ పర్సన్ ఎన్నిక ప్రక్రియలో ఎక్స్‌అఫిషియో ఓట్లను మంత్రి, ఎమ్మెల్సీ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. చైర్‌పర్సన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన మేకల రమ్యను అభినందిస్తూ మంత్రి జూపల్లి, ఎమ్మెల్సీ కూచకుళ్ల శాలువా, పూల మాలతో సన్మానించారు. ఈ సందర్భంగా నూతన చైర్ పర్సన్ మాట్లాడుతూ మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలనలో నిత్యం ప్రజల కోసమే పని చేస్తామన్నారు. తనను నమ్మి గొప్ప అవకాశం కల్పించిన మంత్రి నమ్మకాన్ని వమ్ము చేయకుండా కాంగ్రెస్ కౌన్సిలర్లతో కలిసి కొల్లాపూర్ అభివృద్ధి కోసం పని చేస్తామన్నారు. అనంతరం చైర్ పర్సన్‌ను పలు వార్డుల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు శాలువా, పూల మాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం పట్టణంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి మేకల రమ్య పూల మాల వేసి నివాళులు అర్పించారు.

ఎన్నికల నిర్వాహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా నాగర్‌కర్నూల్ డీఎస్పీ శ్రీనివాసులు, కొల్లాపూర్ సీఐ మహేష్, ఎస్ఐ హృషికేష్ పోలీసు బందోబస్తు నిర్వహించారు. కమిషనర్ శ్రీనివాసన్, తహసీల్దారు శ్రీకాంత్, రెవెన్యూ పోలీసు, మునిసిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించాలి

- నాగర్‌కర్నూల్ కలెక్టర్ ఉదయ్ కుమార్



కౌంటింగ్ శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఉదయ్ కుమార్

నాగర్‌కర్నూల్, మే 31 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నిబంధనలను పక్కాగా పాటిస్తూ జూన్ 4న చేపట్టనున్న పార్లమెంట్ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా నిర్వహించాలని కలెక్టర్ ఉదయ్ కుమార్ అన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ ఓట్ల లెక్కింపును పురస్కరించుకుని శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో 2వ విడత శిక్షణ తరగతులు కౌంటింగ్ సూపర్‌వైజర్లు, సహాయకులు, మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓట్ల లెక్కింపు పక్కాగా జరిగేలా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉదయం 6 గంటలకు కౌంటింగ్ సిబ్బంది ఓట్ల లెక్కింపు కేంద్రం వద్దకు చేరుకోవాలని, రాండమైజేషన్ ద్వారా కేటాయించిన ఆ జాబితాను అనుసరిస్తూ వారికి ఆయా నియోజకవర్గాల వారీగా టేబుళ్లను కేటాయించడం జరుగుతుందన్నారు. ఓట్ల లెక్కింపు కోసం నాగర్‌కర్నూల్, అచ్చంపేట, గద్వాల, వనపర్తి అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి 16 టేబుళ్లు, కల్వకుర్తి, కొల్లాపూర్ నియోజకవర్గాలకు 14 చొప్పున టేబుళ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్‌కు ప్రత్యేకంగా 14 టేబుళ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఓట్ల లెక్కింపు సమయంలో ఈవీఎంలలో ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తితే సంబంధిత నిపుణులు వచ్చి సరిచేస్తారని, కౌంటింగ్ ప్రక్రియ యథాతథంగా కొనసాగించాలని సూచించారు. అనుమానాలకు గందరగోళాన్ని తావిచ్చేలా వ్యవహరించకూడదని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో కౌంటింగ్ హాల్‌లోకి సెల్‌ఫోన్‌లు అనుమతించబడవన్నారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి సమస్య ఎదురైనా వెంటనే సహాయ రిటర్నింగ్ అధికారులను సంప్రదించాలని సూచించారు. ముఖ్యంగా కౌంటింగ్ సూపర్‌వైజర్లు, సహాయకులు, మైక్రోఅబ్జర్వర్లు ఓట్ల లెక్కింపు ప్రక్రియలో క్రియాశీలక పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు.

కౌంటింగ్ హాల్ వద్ద అన్ని సదుపాయాలతో పాటు అల్పాహారం, భోజన వసతి ఉంటుందన్నారు. శిక్షణ నోడల్ అధికారి గోపాల్ నాయక్, ఎల్‌డీఎం కౌశల్ కిషోర్ పాండే తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీని నియమించాలి

-కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పులిజాల పరశురాములు డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పులిజాల పరశురాములు

తెలకపల్లి, మే 31 : జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీని పునర్ నియామకం చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పులిజాల పరశురాములు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పరుశరాములు మాట్లాడుతూ జిల్లాలో దళితులపై దాడులు నిరాటంకంగా కొనసాగుతున్నాయన్నారు. దాడులను అరికట్టేందుకు జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ పునర్ నియామకం చేపట్టాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్సీ కార్పొరేషన్‌కు సంబంధించిన నిధులను వెంటనే విడుదల చేయాలని, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను కల్పించాలని డిమాండ్ చేశారు. 2019 నుంచి గ్రౌండ్ చేయబడిన నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారు. కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న, జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడు సురగిరి హనుమంతు, బొల్లె జగన్, జి.మల్లేష్, నందిపేట భాస్కర్, జిల్లా సహాయ కార్యదర్శి హనుమ, సత్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు చింత ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు నిర్మూలనతోనే ఆరోగ్యం



మన్ననూరు పీహెచ్‌సీ ఆవరణలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది

మన్ననూర్, మే 31: పొగాకు నిర్మూలనతోనే వ్యాధులు దూరమై సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందుతారని మన్ననూరు పీహెచ్‌సీ, ఆయుష్ ఆసుపత్రి వైద్యాధికారులు డాక్టర్ గౌతమ్, డాక్టర్ జాన్సన్ అన్నారు. పొగాకు నిర్మూలన దినోత్సవం సందర్భంగా మన్ననూరు పీహెచ్‌సీ ఆవరణలో రోగులతో కలిసి పొగాకు నిర్మూలనకు కృషి చేద్దామని శుక్రవారం ప్రతిజ్ఞ చేశారు. పొగాకు తీసుకోవడం వలన వచ్చే ప్రాణాంతకర వ్యాధులపై అవగాహన కల్పించారు. ఆరోగ్య పర్యవేక్షకురాలు మారతమ్మ, కాంగ్రెస్ నాయకులు జూలూరి సత్యనారాయణ, పంబలి బుచ్చయ్య, శ్యామ్‌సుందర్ రెడ్డి పాల్గొన్నారు.

ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం

పెద్దకొత్తపల్లి: ప్రభుత్వ ఆసుపత్రి పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకుందామని పెద్దకొత్తపల్లి మండల వైద్యాధికారి డాక్టర్ విజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ప్రపంచ పొగాకు నివారణ దినం సందర్భంగా పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణాన్ని సిబ్బంది ఊడ్చి శుభ్రం చేశారు. సీహెచ్‌వో శ్రీనివాసులు, సూపర్‌వైజర్ బాలాజీసింగ్, ల్యాబ్ టెక్నీషియన్ లక్ష్మీనరసింహగౌడ్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పొగాకుతో ఆరోగ్యానికి హానికరం

బిజినేపల్లి: పొగాకు ఉత్పత్తులను వాడకం ద్వారా మానవ ఆరోగ్యానికి హానికరమని డాక్టర్ మాధవి అన్నారు. మండలంలోని పాలెంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకొని ప్రతిజ్ఞ చేసి ఆమె మాట్లాడారు. పొగాకు ఉత్పత్తులైన సిగరేట్, జర్దా, బీడీ, ఖైనీ, పాన్, హుక్కా వంటి వాటిని తీసుకోవడం ద్వారా నోటి, ఊపిరితిత్తుల క్యాన్సర్లతో పాటు ఇతర రోగాలు వస్తాయని హెచ్చరించారు.

సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలంటే పొగాకు ఉత్పత్తులను వినియోగించవద్దని ఆమె తెలిపారు. వైద్య సిబ్బంది బాదం రాజేశ్వర్, లీలావతి, సుజాత, సుకుమార్ రెడ్డి, ఏఎన్ఎంలు ఉన్నారు.

గ్లోబల్ హ్యూమన్ యూనివర్సిటీ జేడీగా ఆరిఫుద్దీన్



ఆరిఫుద్దీన్‌ను అభినందిస్తున్న దృశ్యం

కల్వకుర్తి, మే 31 : కల్వకుర్తి ప్రాంతానికి చెందిన డాక్టర్ ఆరిఫుద్దీన్ గ్లోబల్ హ్యూమన్ పీస్‌యూనివర్సిటీ జేడీగా నియామకం పొందారు. గత పది సంవత్సరాలుగా సామాజికసేవా కార్యక్రమాలు, వ్యక్తిత్వవికాసం, కేరీర్ గైడెన్స్, హ్యూమన్‌రైట్స్, కన్స్యూమర్‌రైట్స్, సమాచారహక్కు, బ్లడ్‌డోనేషన్ క్యాంపులు, యువజన, మహిళా సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, యూనివర్సిటీ వారు గుర్తించి జాయింట్ డైరెక్టరుగా బాధ్యతలు ఇచ్చారని ఆరిఫుద్దీన్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. వారు ఇచ్చిన ఈ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తానని వివరించారు.

సీసీ రోడ్డు తొలగింపును అడ్డుకున్న వారిపై కేసు

తాడూరు, మే 31 : మండలంలోని తుమ్మలసూగురు గ్రామంలో గత ఆరు నెలల క్రితం నూతనంగా పంచాయతీ నిధులతో సుమారు పది లక్షల రూపాయల విలువ చేసే సీసీరోడ్డును నిర్మించారు. దీంతో గ్రామానికి చెందిన కొందరు అది మా పట్టా భూమిలో ఉందంటూ హైకోర్టులో కేసు దాఖలు చేశారు. ఇందుకు సంబంధించి హైకోర్టు తీర్పు రైతులకు అనుకూలంగా రావడంతో ఆ తీర్పు కాపీని పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్‌కు అందజేశారు. దీంతో ఆయన పట్టా భూమిలో ఉన్న సీసీ రోడ్డును తొలగించే ప్రయత్నం గురువారం చేస్తుండడంతో గ్రామానికి చెందిన కొందరు అడ్డుకున్నారు. విషయంపై శుక్రవారం పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇందుకు కలెక్టర్ ఆదేశాలు ఉన్నప్పటికీ వీరు రోడ్డును తొలగింపును అడ్డుకున్నందుకు గాను కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు. రోడ్డును తీయకుండా అడ్డుకునే ప్రయత్నం చేసిన శేఖర్‌గౌడ్, వెంకటయ్యగౌడ్, రామాంజనమ్మ, అనిత, నాగయ్య, వెంకటయ్యగౌడ్, శ్యామలమ్మలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎంపీ



ఎల్లమ్మ మృతదేహానికి నివాళి అర్పిస్తున్న ఎంపీ రాములు

కల్వకుర్తి, మే 31 : కల్వకుర్తి మండలంలోని గుండూరు గ్రామంలో శుక్రవారం మృతి చెందిన పోతుగంటి ఎల్లమ్మ మృతదేహానికి నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు పూలమాల వేసి నివాళి అర్పించారు. దగ్గరి బంధువులు కావడంతో బాధిత కుటుంబ సభ్యులను ఆయన ఓదార్చారు. ఆయన వెంట బీజేపీ నాయకులు, గ్రామస్థులు తదితరులున్నారు.

ఆవిర్భావ వేడుకలను అట్టహాసంగా నిర్వహిద్దాం



ఆవిర్భావ వేడుకలకు స్థల పరిశీలన చేస్తున్న ఆనంద్‌కుమార్

కల్వకుర్తి మే 31; తెలంగాణ ఆవిర్భావ వేడుకలను జూన్ 2న అట్టహాసంగా నిర్వహించుకుందామని కాంగ్రెస్ రాష్ట నాయకుడు బృంగి ఆనందుకుమార్ అన్నారు. శుక్రవారం ఆవిర్భావ వేడుకల ఏర్పాట్లను మాజీ సర్పంచ్‌లు జిల్లెల రాములు, దామోదర్‌గౌడ్, జేఏసీ చైర్మన్ సదానందంగౌడ్‌తో కలిసి ఆనందుకుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమర వీరులకు నివాళి అర్పించిన అనంతరం మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు అయన పేర్కొన్నారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. ఆవిర్భావ వేడుకలకు ప్రజలు హాజరై విజయవంతం చేయాలన్నారు. రవిగౌడ్, రామకృష్ణ, చంద్రకాంత్, రాఖేష్, ఆరీఫ్, తదితరులున్నారు.

బడి ఈడు పిల్లల్ని బడిలో చేర్పించాలి

- జిల్లా సెక్టోరియల్ అధికారి మురళీధర్‌రెడ్డి

కోడేరు, మే 31: బడి వయస్సు ఉన్న పిల్లలను గుర్తించి విద్యార్థులకు, తల్లిదండ్రులకు విద్య యొక్క ప్రాముఖ్యతను తెలిపి బడి ఈడు పిల్లల్ని బడిలో చేర్చాలని జిల్లా సెక్టోరియల్ అధికారి మురళీధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిషత్తు కార్యాలయంలో మండల స్థాయి ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సెక్టోరియల్ అధికారి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 3 నుంచి 19 వరకు ప్రభుత్వం బడి బాట కార్యక్రమం చేపట్టిందన్నారు. ఉపాధ్యాయులు బడి బాటలో గ్రామాలను సందర్శించి బడి ఈడు పిల్లలను గుర్తించి వారి పేర్లను నమోదు చేయాలన్నారు. చదువు లేకపోతే సమాజంలో జీవించడం కష్టమని వారికి తెలియజేయాలన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న వసతులు, సౌకర్యాలను వివరించాలని సూచించారు. నోడల్ అధికారి నిర్మల, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు భాస్కర్‌శర్మ, కృష్ణయ్య ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పండ్ల తోటలను ప్రోత్సహించాలి

వెల్దండ, మే 31 : గ్రామాల్లో రైతులకు పండ్లతోటల పెంపకంపై అవగాహన కల్పించాలని ఎంపీడీవో సత్యపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ పనులపై ఏర్పాటుచేసిన ప్రత్యేక సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతీ గ్రామపంచాయతీకి ఐదు ఎకరాల పండ్లతోటలు, ఐదు పారంపాండ్స్ నిర్మించాలని సూచించారు. ప్రతీ గ్రామపంచాయతీలో 5200 హరితహారం ఎస్టిమేట్స్ తయారు చేయాలని సత్యపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఏపీవో ఈశ్వర్, ఎంపీవో సునిత, టీఏలు, ఈసీ, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్‌అసిస్టెంట్లు ఉన్నారు.

ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం

పెద్దకొత్తపల్లి, మే 31: ప్రభుత్వ ఆసుపత్రి పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకుందామని పెద్దకొత్తపల్లి మండల వైద్యాధికారి డాక్టర్ విజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ప్రపంచ పొగాకు నివారణ దినం సందర్భంగా పెద్దకొత్తపల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణాన్ని సిబ్బంది ఊడ్చి శుభ్రం చేశారు. సీహెచ్‌వో శ్రీనివాసులు, సూపర్‌వైజర్ బాలాజీసింగ్, ల్యాబ్ టెక్నీషియన్ లక్ష్మీనరసింహగౌడ్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పత్తి విత్తనాలపై రైతులకు అవగాహన

చారకొండ, మే 31: ఖరీఫ్ సీజన్‌లో రైతులు పత్తి విత్తనాలపై జాగ్రత్తలు తీసుకొని కొనుగోలు చేయాలని ఏఈవో వంశీ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని శిర్సనగండ్ల రైతు వేదికలో పత్తి విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు నాసిరకం విత్తనాలు కొనుగోలు చేయకుండా నాణ్యతమైన విత్తనాలను కొనుగోలు చేయాలని అన్నారు. లైసెన్సులు లేని డీలర్ల వద్ద విత్తనాలు కొనుగోలు చేయరాదని, లైసెన్సులు కలిగి ఉన్న డీలర్ల వద్దనే కొనుగోలు చేయాలని రైతులకు సూచించారు. డీలర్ల వద్ద విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు రశీదులు తప్పని సరిగా తీసుకోవాలని పేర్కొన్నారు. విత్తనాల కొనుగోలులో వ్యవసాయశాఖ అధికారుల సలహాలు, సూచనలు తీసుకోవాలని అన్నారు.

● వెల్దండ: మండల కేంద్రంతో పాటు చొక్కన్నపల్లి, పెద్దాపూర్ గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు పచ్చిరొట్ట ఎరువులు ఉపయోగించాలని, 60 శాతం సబ్సీడీతో సింగిల్‌విండో ద్వారా జీలుగ, జనుము, పిల్లిపెసర సరపరా చేస్తున్నట్లు అధికారులు వివరించారు. భూసారాన్ని పెంపొందించడంతోపాటు నత్రజని స్థిరీకరించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఎరువుల దుకాణాలలో విత్తనాలు కొనుగోలు చేసేసమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సంబంధిత దుకాణాల ద్వారా బిల్లులు విధిగా పొందాలని, పంటకాలం పూర్తయ్యేవరకు బిల్లులు భద్రపరుచుకోవాలని అన్నారు. పంట తెగుళ్లు వస్తే వ్యవసాయాధికారులను సంప్రదించాలని కోరారు. ఏఈవో సురేష్ ఉన్నారు.

పరిహారం కోసం తహసీల్దారుకు వినతి



కొల్లాపూర్ తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న కుడికిళ్ల రైతులు

కొల్లాపూర్, మే 31: మండల పరిధిలోని కుడికిళ్ల గ్రామానికి చెందిన రైతులు పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో ఉన్న భూములను తక్కువ ధరలకే ప్రభుత్వానికి అప్పగించామని, గ్రామ శివారులోని విక్రయానికి సిద్ధంగా ఉన్న భూమిని ఇతరులకు విక్రయించకుండా నిర్వాసితులకే చెందేలా చర్యలు చేపట్టాలని కోరుతూ శుక్రవారం కొల్లాపూర్ తహసీల్దారు శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. దాదాపు వందమంది రైతులు తహసీల్దారును కలిసి తమ సమస్యను వివరించారు. ఈ భూమిని సర్వే చేయించి నిర్వాసితులకే దక్కేలా అధికారులు చర్యలు చేపట్టాలని, భూమికి పరిహారం కూడా చెల్లిస్తామని రైతులు తహసీల్దారుకు వివరించారు.

మండల స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

పెంట్లవెల్లి, మే 31: మండల పరిధిలోని జటప్రోలు గ్రామంలో గురువారం మండల స్థాయి క్రికెట్ పోటీలను వైస్ ఎంపీపీ భీమ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ గోవిందుగౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల స్థాయి క్రికెట్ పోటీల్లో మొత్తం 16 టీంలు పాల్గొంటున్నాయని తెలిపారు, పోటీల్లో మొదటి బహుమతిగా రూ.10 వేలు, రెండో బహుమతిగా రూ.5 వేలు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బహుమతుల ప్రదానం చేస్తామన్నారు. మోత్కూరు నాగిరెడ్డి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి 28 వరకు సదరం క్యాంపు

నాగర్‌కర్నూల్ టౌన్, మే 31: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ నెల 3 నుంచి 28 వరకు సదరం క్యాంపు నిర్వహించనున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి చిన్న ఓబులేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శారీరక దివ్యాంగులకు ఈ నెల 3, 10, 18, 24 తేదీల్లో, వినికిడి లోపం ఉన్న వారికి 10, 24 తేదీల్లో, కంటిచూపు లోపం ఉన్న వారికి 5, 21 తేదీల్లో, మానసిక వికలాంగులకు 14, 28 తేదీల్లో సదరం క్యాంపు ఉంటుందని పేర్కొన్నారు. మానసిక వైద్యానికి చెందిన డాక్టర్ సెలవులో ఉన్నందున మానిసిక దివ్యాంగులు మీసేవలో స్లాట్ బుక్ చేసుకుని మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహిస్తున్న సదరం క్యాంపునకు హాజరు కావాలని సూచించారు. సదరం క్యాంపునకు హాజరయ్యే దివ్యాంగులు ఈ నెల 2 నుంచి మీసేవలో స్లాట్ బుక్ చేసుకుని నిర్దేశించిన తేదీల్లో హాజరు కావాలని సూచించారు.

నేడు విద్యుత్ అంతరాయం

అచ్చంపేటటౌన్, మే 31: అచ్చంపేట మండలంలోని హాజీపూర్ సబ్‌స్టేషన్ 33కేవీ నడింపల్లి లైను మరమ్మతుల పనుల కారణంగా ఉదయం 10గంటల నుంచి 2గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్ ఏఈ ఆంజనేయులు తెలిపారు. మండల పరిధిలోని హాజీపూర్, బుడ్డతండా, సింగారం, ఎద్దుమిట్టతండా, అంకిరోనిపల్లి, చెన్నారం, రాయిచేడ్ గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.

బడిబాట ప్రణాళికపై సమీక్ష



బడిబాట ప్రణాళిక అమలుపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో పాల్గొన్న అధికారులు

బిజినేపల్లి, మే 31 : 2024-25 విద్యాసంవత్సరం బడి ఈడు పిల్లలు బడిలో ఉండేలా ప్రణాళిక రూపొందించుకొని ప్రతీ ఒక్క చిన్నారిని బడిలో చేరేలా మండలాధికారులంతా బాధ్యతగా ఉండాలని తహసీల్దార్ శ్రీరాములు అన్నారు. మండలంలోని ఎంపీడీవో సమావేశపు కార్యాలయంలో శుక్రవారం బడిబాట ప్రణాళికపై సమీక్షా సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. జూన్ 3 నుంచి 19 వరకు అన్ని గ్రామాల్లో నిర్వహించే బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రతీ అధికారి గ్రామాల్లోని బడి ఈడు పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయుల బోధన, మధ్యాహ్న భోజనం, పుస్తకాలు, ఏకరూప దుస్తులు అందజేయనున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించాలని తెలిపారు. ఎంపీడీవో కతాలప్ప, ఎంపీవో రాములు నాయక్, ఎంఈవో భాస్కర్ రెడ్డి, ఏపీఎం రజిత తదితరులు ఉన్నారు.